ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు - 99854 09260
కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు - 9985411379
ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు - 9985171793
నంద్యాల, పాణ్యం, ఆళ్ళగడ్డ, బనగానపల్లె - 9985411377

తుంగభద్రతకు చర్యలు



తుంగభద్ర డ్యాం నూతన గేట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. టీబీపీ బోర్డు అధికారులు ప్రత్యేక పూజలు చేసి పనులకు అంకురార్పణ చేశారు. ఇందులో భాగంగా ముందు కాంట్రాక్ట్ సంస్థ పాత గేట్లు తొలగించే పనులు మొదలుపెట్టారు. రూ.44 కోట్లతో చేపట్టే పనులను గుజరాత్‌కు చెందిన హార్డ్‌వేర్ అండ్ టూల్స్ సంస్థ చేపట్టింది. ఎట్టి పరిస్థితుల్లో 2026 జూన్ ఆఖరులోగా గేట్ల అమరిక పూర్తి చేసేందుకు బోర్డు ఇంజనీర్లు పక్కా ప్రణాళిక తయారు చేశారు. దీంతో జనవరి 11 వరకు సాగులో ఉన్న పంటలకు నీరు ఇచ్చి ఆ తరువాత అవసరాన్ని బట్టి తాగునీరు మాత్రమే ఇస్తామని తేల్చి చెప్పారు. గేట్ల ఏర్పాటు కోసం ఆంధ్రప్రదేశ్ వాటా నిధులు రూ.20 కోట్లు విడుదల చేసింది. కర్ణాటక వాటా నిధులు విడుదల చేయాల్సి ఉంది.

- తుంగభద్ర గేట్ల ఏర్పాటుకు శ్రీకారం
- ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించిన టీబీపీ బోర్డు అధికారులు
- నూతనంగా 33 గేట్ల అమరిక
- ఏపీ వాటా రూ.20 కోట్లు విడుదల
- నిధులు విడుదల చేయని కర్ణాటక ప్రభుత్వం
- 2026 జూన్ ఆఖరి పనులు పూర్తయ్యేలా ప్లాన్

కర్నూలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా, కర్ణాటక రాష్ట్రాల ప్రధాన నీటి ఆధారమైన తుంగభద్ర డ్యాం నూతన గేట్లు ఏర్పాటుకు టీబీపీ బోర్డు అధికారులు సన్నాహాలు చేపట్టారు. డ్యాంకు మొత్తం 33 క్రస్ట్‌గేట్లు గేట్లు ఉన్నాయి. గతేడాది ఆగస్టులో 19వ నంబరు గేటు కొట్టుకుపోవడంతో డ్యాం భద్రతపై పలు అనుమానాలు తలెత్తాయి. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ), నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ), డ్యాంను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన ఏకే బజాజ్ కమిటీ సిఫార్సుల మేరకు గేట్లు, ప్రాజెక్టు సామర్థ్యంపై టీబీపీ బోర్డు అధ్యయనం చేయించింది. గేట్ల సామర్థ్యం నిర్ధారణ, రేడియోగ్రఫీ, ఎంపీటీ, అల్ట్రాసోనిక్, డీపీటీలో అనుభవం, నైపుణ్యం కలిగిన కేఎస్ఎన్‌డీటీ సర్వీసెస్ సంస్థ అధ్యయనం చేసింది. 2024 ఆగస్టులో కొట్టుకుపోయిన 19వ గేటుతో పాటు మరో 32 గేట్ల సామర్థ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి గేటుకు 15 రకాల పరీక్షలు నిర్వహించారు. డ్యాం గేట్లన్నీ భారీగా తుప్పుపట్టి భారీ రంధ్రాలు ఏర్పడ్డాయని, కొన్ని ప్రదేశాల్లో రంధ్రాల వల్ల గేటు ప్లేట్లు బాగా ధ్వంసం అయ్యాయని, గుస్సెట్ ప్లేట్లు, దిగువ స్టిఫినర్లు, గేట్లకు సపోర్టుగా ఉండే గడ్డర్లు, సపోర్టింగ్ ప్లేట్లు కూడా బాగా తుప్పుపట్టి, చిల్లులు పడ్డాయని ఆ సంస్థ ఇచ్చిన నివేదికలో వెల్లడించింది. గేట్ల సామర్థ్యం 45 ఏళ్లు కాగా, తుంగభద్ర గేట్లు 70 ఏళ్లు దాటడంతో మొత్తం గేట్లన్నీ మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టంగా వివరించారు. ఆ నివేదిక ఆధారంగా డ్యాం 33 గేట్లు తొలగించి వాటి స్థానంలో కొత్త గేట్లు ఏర్పాటు చేసేందుకు టీబీపీ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది.

మిగతా 7వ పేజీలో



తుంగభద్ర డ్యాంకు కొత్త గేట్లు అమర్చడంలో భాగంగా పాత గేటు తొలగించే పనుల్లో నిమగ్నమైన టెక్నికల్ సిబ్బంది

రేపు పీజీఆర్ఎస్

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని కలెక్టర్ సిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నెంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అర్జీదారులు Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ప్రజల్లోకి సురక్ష యాప్ సేవలు

- సారా రహితమే లక్ష్యం కావాలి
- ఉమ్మడి జిల్లా సీఐలతో డీసీ సమీక్ష



మాట్లాడుతున్న ఎక్సైజ్ డీసీ శ్రీదేవి

కర్నూలు అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సురక్ష యాప్ సేవలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి. శ్రీదేవి అన్నారు. శనివారం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల సీఐలతో అసిస్టెంట్ కమిషనర్ వి. హనుమంతరావు, సూపరింటెండెంట్ సుధార్‌బాబులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ మద్యం కొనుగోలుదారులకు ఇబ్బందులు తల్తెకుండా, అక్రమ మద్యానికి అవకాశం లేకుండా సురక్ష యాప్ సేవలను అందుబాటులోకి తీసుకెళ్లాలని సూచించారు. జిల్లాను సారా రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి స్టేషన్ పరిధిలో ప్రణాళికతో పని చేయాలన్నారు. కేసుల పురోగతి, జిల్లాలో అక్రమ మద్యం, సారాపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు.

స్మార్ట్ సిటీకి ప్రణాళికలు రూపొందించండి

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలును స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ సిరి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో కర్నూలు స్మార్ట్ సిటీ అంశంపై మున్సిపల్ కమిషనర్, సిబ్బందితో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్నాథగట్టుపై ఒక మంచి పార్కు నగరంలో మూడు పార్కులు ఉండేలాగా ప్రణాళికలు ఉండాలన్నారు. స్మార్ట్ సిటీ అభివృద్ధిలో భాగంగా నిరంతర తాగునీటి సరఫరా, అండర్ గ్రౌండు డ్రైనేజీ సిస్టమ్ ఏర్పాటుకు అత్యంత ప్రాముఖ్యతను ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన జలశక్తి, అమృత్, పీఎం గతి శక్తి, స్వచ్ఛ భారత్ మిషన్, స్వదేశీ దర్శన్, నేషనల్ గ్రీన్ ఎయిర్ తదితర పథకాలను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రణాళికల రూపకల్పనలో మంత్రి టీజీ భరత్, పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు సలహాలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను సూచించారు. సమావేశంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి ఎన్టీఆర్

- బీసీలకు ప్రాధాన్యమిచ్చిన టీడీపీ
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

6

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ధి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి

కర్నూలు లీగల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఈ నెల 13వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లాలో విజయవంతం చేయాలని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ధి కోరారు. స్థానిక జిల్లా కోర్టు హాలులో పీపీలు, ఏపీపీలు, జీపీలు బీమా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో మోటారు వాహనాల ప్రమాదాల కేసులు, సివిల్ కేసులు, భూసేకరణ కేసులు, బ్యాంకు, చిట్‌ఫండ్ వివాదాల కేసులను పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. రాజీకి వీలున్న క్రిమినల్ కేసులే గాక ప్రిలిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారానికి పలు బెంచీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకటశేషాద్రి, ఆర్టీసీ రీజనల్ మేనేజర్ శ్రీనివాసులు, కర్నూలు డిపో మేనేజర్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలి

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉగాది నాటికి 14వేల ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని కలెక్టర్ సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి హౌసింగ్ పురోగతిపై నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్స్ సంబంధిత అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పీఎంఏవై-2.0 గ్రామీణ్ సర్వేలో భాగంగా మొత్తం 30,980 గృహాల సర్వే పూర్తయిందన్నారు. ఆప్షన్-3 కింద కాంట్రాక్టర్‌లు నిర్మించిన ఇళ్లలో గుర్తించిన లోపాలను ఈ నెల 20వ తేదీలోపు సంబంధిత ఏజెన్సీలు సరి చేయాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పీడీ చిరంజీవి, జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు జిల్లా కావాలి..

- ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు



ఎమ్మిగనూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆదోని జిల్లా కావాలని మా ఎమ్మిగనూరులో ఎవరు నన్ను అడగలేదని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి బదులిచ్చారు. శనివారం ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆదోని జిల్లా డిమాండ్‌పై మాట్లాడుతూ నా స్వార్థం నాది ఎమ్మిగనూరు జిల్లా కావాలని నాకు ఉంది. మా వాళ్లు నన్ను అదే అడుగుతున్నారు. మావాళ్ల ఆకాంక్షను సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తా. ఆదోని జిల్లా ఏర్పడిన పత్తికొండ, ఆలూరు, కోడుమూరు నుంచి కర్నూలుకు వెళ్లే దూరంలో కాస్త తగ్గుతుందన్నారు. ఈఅంశాలను దృష్టిలో పెట్టుకొని సీఎంతో చర్చిస్తామన్నారు.

తుంగభద్ర తీరం
సాహిత్యం

అవధూత గాథ


● పద్య కావ్యంగా శ్రీసుబ్బగురు చరిత్ర
● మరుగునపడ్డ ఆధ్యాత్మికుడి జీవితాన్ని అక్షరబద్ధం చేసిన దోనెపూడి లక్ష్మీనారాయణ

నంద్యాల కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అనాదిగా రాయలసీమలో ఆధ్యాత్మిక సంప్రదాయం కొనసాగుతున్నది. ఎంతో మంది తాత్వికులు, యోగులు ఇక్కడ సంచరించారు. కాలజ్ఞానం రాసిన వీరబ్రహ్మేంద్ర స్వామి, ప్రజాకవిగా పేరొందిన వేమన లాంటి ప్రసిద్ధులే కాకుండా కాశిరెడ్డి నాయన వంటి అవధూతలు తిరిగిన ప్రాంతం ఇది. అలాంటి వారిలో ఒకరు శ్రీసుబ్బగురు అవధూత. ఆయన నంద్యాల జిల్లా గోస్పాడు మండలం జూలేపల్లె గ్రామంలో జీవించారు. ఆయన జీవిత చరిత్రను కవి దోనేపూడి లక్ష్మీనారాయణ రాశారు.

శ్రీసుబ్బగురు అవధూత జీవితానికి ఏ చారిత్రక సాక్ష్యాలు లేవు. ఎంతో మందికి ఆదర్శంగా నిలిచి, సజీవ సమాధి పొందిన సుబ్బ గురువు జీవితాన్ని ఒక కావ్యంగా రాశారు. జూలేపల్లి గ్రామ నివాసి, పురోహితుడు దోనేపూడి లక్ష్మీనారాయణ. సుబ్బగురు జీవితాన్ని ఒక కమనీయమైన పద్యకావ్యంగా రచించారు. 2007లో రచయిత మరణించారు. 2021లో ఆ గ్రంథం వెలుగులోకి వచ్చింది. పద్యకావ్యాలు రాయడం అరుదైన ఈ రోజుల్లో లక్ష్మీనారాయణ ఈ రచన చేశారు. ప్రౌఢ పద సౌష్టవంతో సుమారు 1000 పద్యాలతో 200 పేజీల ఈ గ్రంథం వెలువడింది. దోనెపూడి లక్ష్మీనారాయణ దీనిని వచన కావ్యంగా కూడా రాయాలని సంకల్పించారు. అది కూడా కొంత వరకే సాగింది. ఆతర్వాత ఆగిపోయింది. దానిని కూడా ప్రచురణకర్తలు ఈ పద్య కావ్యానికి అనుబంధంగా ఇచ్చారు.

» శ్రీసుబ్బయోగి జీవితం, మహిమలు కీలకాంశాలుగా ఈ కధా కావ్యం నడిచింది. చారిత్రక కథను, పౌరాణిక వాతావరణాన్ని మిళితం చేసి రాశారు. ఋష్యాశ్రమ వాతావరణాన్ని, దేవలోక వృత్తాంతాల్ని పాఠకులకు సాక్షాత్కరింపచేశారు.

» ఉత్తర కథలో సుబ్బయోగి మరణానంతర కథను ఎక్కువ వాస్తవిక దృష్టితో విస్తరించారు. మఠ నిర్వహణ, శిథిలావస్థలో ఉన్న మఠ పునర్నిర్మాణం మొదలైన విషయాలతో కధ సాగించారు. ఈ కావ్యంలో ఉన్న కధ చాలా వరకు సూటిగా సాగింది. ఒకటి రెండు చోట్ల కవి ఫ్లాష్ బ్యాక్ టెక్నిక్ పాటించారు. మొత్తం మీద కథను మనోహరంగా రాశారు.



» ఈ కథలోని నాయకుడు దివ్యతుల్యుడు. మహిమాన్వితుడు, . ధీరశాంతుడు. సామాజిక స్పృహ ఉన్న యోగిపుంగవుడు. ఇందులోని ప్రధాన రసం అద్వైతాత్మకమైన భక్తి. అక్కడక్కడ అద్భుత రసం ప్రాధాన్యం వహించింది. ఇది భక్తికి తోడైంది. శృంగార వీర కరుణ రసాలు కూడా ఉన్నాయి. ఈ కావ్యం ఆనందాన్ని ప్రసాదించడమే కాక హితోపదేశాన్ని కూడ అందిస్తుంది. విజ్ఞానాన్ని వికసింపజేస్తుంది. లక్ష్మీనారాయణ అనేక సూక్తులను ఈ కథలో చెప్పారు. మానవులకు అభిమానం ముఖ్యమని, అతడు అరిషడ్వర్గాల్ని జయించాలని, సత్త్వగుణాన్ని అలవరచుకోవాలని, ధర్మాన్ని రక్షించాలని, మానవసేవ చేయాలని సజ్జన సాంగత్యాన్ని అవలంబించాలని, గురువాక్యాన్ని శిరసావహించాలని రాశారు.

» లక్ష్మీనారాయణగారి ఇల్లు అగ్నిప్రమాదానికి గురైనప్పుడు ఆయన కుటుంబసభ్యులు కట్టుబట్టలతో బయటపడ్డారు. ఆయన పుస్తకాలన్నీ కాలిపోయాయి. కానీ ఆయన రాసిన శ్రీసుబ్బగురు చరిత్ర రాత ప్రతి మాత్రం మిగిలింది. అందువల్లే ఆ తర్వాత అది అచ్చయి పాఠకులను చేరుకోగలిగింది. ఈ పుస్తక ప్రతులు కావాల్సిన వారు సెల్‌నెంబర్-9491416696ను సంప్రదించవచ్చు.



-అన్నెం శ్రీనివాసరెడ్డి, నంద్యాల

టాలెంట్

మధురమైన కళ

● చిత్రలేఖనంలో రాణిస్తున్న మధుక్రిష్ణ
● ప్రముఖుల చిత్రాలు వేసి పలువురి మన్నన



సుద్ధముక్కతో ఆకర్షణీయంగా వివిధ అకృతులు

ప్యాపిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మధుక్రిష్ణ సూక్ష్మ చిత్రలేఖన కళాకారుడు. కేవలం సుద్దముక్కలతో అబ్బురపరిచే కళారూపాలు చిత్రిస్తున్నాడు. ఆయనది మండలంలోని వెంగళాంపల్లి గ్రామం. చిన్నతనంలోనే చిత్రలేఖనంపై మక్కువ పెంచుకున్న మధుక్రిష్ణ ప్రాథమిక విద్య చదువుతున్న రోజుల్లోనే చిన్న చిన్న చిత్రాలు వేసి ఉపాధ్యాయుల ప్రశంసలు పొందాడు. ఉన్నత విద్యలోకి వెళ్లాక కూడా తన అభిరుచిని వదులుకోలేదు. మరింతగా చిత్ర లేఖనంపై పట్టు సాధించాడు.

మధుక్రిష్ణ డిగ్రీ, టీటీసీ పూర్తి చేశాడు. సుద్దముక్కలతో తనదైన శైలిలో సూక్ష్మరూప చిత్రాలు గీస్తూ గుర్తింపు సంపాదించాడు. ప్రముఖుల జయంతి సందర్భంగా వారి చిత్రాలను సూక్ష్మరూపంలో తీర్చిదిద్దుతున్నాడు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జయంతిని పురస్కరించుకొని బాదం ఆకుపై వారి చిత్రాలను గీచి ప్రశంసలు అందుకున్నాడు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిత్రాలను కోడుగుడ్డుపై ఆకట్టుకొనేలా చిత్రీకరించాడు.



బాదం ఆకుపై అంబేద్కర్ చిత్రం



సూక్ష్మ ఎర్రకోటపై జాతీయ పతాకం నమూన



కోడి గుడ్డుపై శ్రీనివాసరామానుజన్ చిత్రం

సుద్దముక్కతో అద్భుత ఆకృతులు

సుద్దముక్కలతో మధుక్రిష్ణ సూక్ష్మ చిత్రాలను గీచడం విశేషం. నాసా తయారు చేసిన చంద్రయాన్ విజయవంతం కావడంతో ఆ ఏడాది సుద్దముక్కతో చంద్రయాన్ ఆకృతిని గీచాడు. అలాగే ఆగస్టు 15ను పురస్కరించుకొని ఎర్రకోటపై జాతీయ జెండాను చిత్రీకరించాడు. సూక్ష్మ వరల్డ్ కప్, బుల్లి కెమేరాతో పాటు వివిధ ఆకృతులను సుద్దముక్కలతో ఆకర్షణీయం చిత్రీకరించడం ఆయన ప్రతిభకు నిదర్శనం.

రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందాలన్నదే లక్ష్యం: మధుక్రిష్ణ



చిన్నతనం నుంచే చిత్రలేఖనంపై ఆసక్తి ఎక్కువగా ఉండేది. నేను గీసిన చిత్రాలను ఉపాధ్యాయులు కూడ మెచ్చుకొనేవారు. దీంతో చిత్రలేఖనంపై మరింత ఆసక్తి పెరిగింది. దీంతో ఇంటర్, డిగ్రీ, టీటీసీ చదివే సమయంలో కూడ చిత్రాలను వేశాను. ఏనాటికైనా రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలన్నదే లక్ష్యం.

అలరించిన 'సైరా నరసింహారెడ్డి' నాటకం

గడివేముల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాశిరెడ్డి నాయన స్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా గడివేముల మండలంలోని గని గ్రామంలో సైరా నరసింహారెడ్డి చారిత్రాత్మక పద్యనాటకం అలరించింది. టీజీవీ కళాక్షేత్రం, బుడ్డా వెంగళరెడ్డి కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ప్రదర్శించిన ఈ నాటకం ఆద్యంతం ఆకట్టుకుంది. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత వృత్తాంతంలోని యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందించిన ఈ నాటకంలో కళాకారులు తమదైన శైలిలో నటనాచాతుర్యాన్ని ప్రదర్శించారు. కళాకారులు జీవీ శ్రీనివాసరెడ్డి, బాలవెంకటేశ్వర్లు, పి.రాజారత్నం, గజల్ మహ్మద్ మియ, వాల్మీకి రాముడు, గాండ్ల లక్ష్మన్న, సంగా ఆంజనేయులు, ఆర్.శ్యామేలు, పి.భాస్కర్, నవీన్ చౌదరి, రేణుక, హసీనా తదితరులు విభిన్న పాత్రల్లో అలరించారు. ఈ సందర్భంగా కార్యక్రమ కన్వీనర్లు కె.వి.రమణ, కదిరి రమేష్ మాట్లాడుతూ దివంగత పల్లేటి కులశేఖర్ రచన, కళారత్న పత్తి ఓబులయ్య దర్శకత్వంలో సైసైరా నరసింహారెడ్డి నాటకానికి ఎన్నో అవార్డులు, ప్రశంసలు వచ్చాయన్నారు. ఇదిలా ఉండగా గని గ్రామంలోని కాశిరెడ్డినాయన ఆశ్రమంలో నిర్వాహకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వందలాదిగా తరలివచ్చిన భక్తులు అన్నదానం చేపట్టారు. సైరా నాటక ప్రదర్శనలో సంగీతం మాస్టర్లు బండారు బలరాం, రామలింగయ్య, మహేశ్, నంద్యాల రామబ్రహ్మం మేకప్ పాల్గొన్నారు.



నరసింహారెడ్డి నాటకంలోని ఓ సన్నివేశం

సంప్రదాయ క్రీడల్లో ఎద్దుల పోటీలకు ప్రాముఖ్యత

● రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



ఎద్దుల పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి బీ.సీ జనార్దన్ రెడ్డి

సంజామల, డిసెంబరు 6,(ఆంధ్రజ్యోతి): తెలుగువారి సంప్రదాయ క్రీడల్లో ఎద్దుల పోటీలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవాల్లో భాగంగా ముక్కమల్ల టీడీపీ నాయకులు మూసాని చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి న్యూక్యాటగిరి విభాగానికి చెందిన ఎద్దుల పోటీలను మంత్రి ప్రారంభించారు. ఆయనకు కమిటీ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ వ్యవసాయంలో యాంత్రీకత చోటుచేసుకున్నప్పటికీ ప్రస్తుత సమాజంలో ఎద్దులను పోషించడం కష్టతరమన్నారు. అయినప్పటికీ రైతులు వ్యయప్రయాసాలు వెచ్చించి ఎద్దులను పోషిస్తూ పోటీల్లో పాల్గొనడం హర్షణీయమన్నారు. అనగనూరుకి చెందిన సాయిగణేష్ శర్మ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన వారైనా 10 గ్రామాలకు పౌరోహితం చేస్తూ పోటీ ఎద్దులను పోషించడం వారికి సారధ్యం వహించడం గర్వించదగ్గ విషయమని శర్మను అభినందించి సత్కరించారు. ప్రథమ విజేతకు రూ. 60వేలు నగదు ప్రోత్సాహకాన్ని మంత్రి అందజేశారు. టీడీపీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, మంచాల మద్దిలేటిరెడ్డి, శంకర్‌రెడ్డి, ఆకుమళ్ల సొసైటీ చైర్మన్ మోహన్ రెడ్డి, పరమేశ్వర రెడ్డి, మల్కి హుసేన్, మద్దిలేటి, తిమ్మయ్య, రామగోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేతలుగా ప్రకాశం జిల్లా ఎద్దులు

రాష్ట్ర నలుమూలల నుంచి 19 జతల ఎద్దులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన పోటీల్లో ప్రకాశం జిల్లా మద్దిరాళ్ల ముపాలకి చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి ఎద్దులు ప్రథమ విజేతగా నిలిచాయి. గుంటూరు జిల్లా కొండబాల వారి పాలెంకి చెందిన జి.పి చౌదరి ఎద్దులు, తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూలు జిల్లా రాయవరానికి చెందిన రెండు, మూడో స్థానాల్లో నిలిచాయి. నాల్గవస్థానంలో కడప జిల్లా దువ్వూరు మండలం గొల్లపల్లికి చెందిన చంద్ర ఓబుల్‌రెడ్డి ఎద్దులు, ఐదో స్థానంలో నంద్యాల జిల్లా పిన్నాపురానికి నికి చెందిన వెంకటక్రిష్ణ ఎద్దులు దక్కించుకున్నాయి. విజేతలకు నగదు ప్రోత్సాహక బహుమతులను కమిటీ వారు అందజేశారు.

ర్యాగింగ్ నిరోధానికి సహకరించాలి

● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో ర్యాగింగ్ భూతాన్ని తరిమి కొట్టేందుకు విద్యార్థులందరూ సహకరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి సూచించారు. శనివారం జి. పుల్లారెడ్డి డెంటల్ కాలేజీలో జరిగిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే.. చట్టప్రకారం కఠిన శిక్షలు ఉన్నాయని, జీవితాలు నాశనమవుతాయని తెలిపారు. ర్యాగింగ్‌కు గురైన విద్యార్థులు లీగల్ సర్వీసెస్ టోల్ ఫ్రీ నెం.15100 కాల్ చేస్తే వారికి తక్షణ న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ సుబ్బారెడ్డి, మేనేజింగ్ ట్రస్టీలు రాఘవరెడ్డి, ఏకాంబరరెడ్డి, డైరెక్టర్ వై. మురళీధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నాగలక్ష్మి రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి

క్రీడాకారులు దేశం గర్వించేలా ఎదగాలి

● అర్జున అవార్డు గ్రహీత, బ్యాడ్మింటన్ ఆటగాడు చేతన్ ఆనంద్
● ఆర్జీఎంలో ఇండోర్ స్టేడియం ప్రారంభం

పాణ్యం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు దేశం గర్వించేలా ఎదగాలని అర్జున అవార్డు గ్రహీత, భారత బ్యాడ్మింటన్ ఆటగాడు చేతన్ ఆనంద్ అన్నారు. శనివారం ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో నూతనంగా నిర్మించిన బాల్‌బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రామాణికాలతో ఇండోర్ స్టేడియం నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ ప్రాంతం నుంచి జాతీయ స్థాయిలో బ్యాడ్మింటన్ క్రీడాకారులు తయారవుతారనే ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడలపై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలని కోరారు. క్రీడలు మానసికంగానే కాక ఆర్థికంగా, పేరుప్రతిష్టలకు దోహదపడతాయన్నారు. కళాశాల ఎండీ శివరాం మా ట్లాడుతూ విద్యార్థుల క్రీడాభ్యున్నతికి మరింత కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ క్రీడాకారులకు క్రీడా రంగంలో సౌకర్యాలు కల్పించి ప్రోత్సహించే దిశగా కళాశాల నిత్యం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌లు జయచంద్రప్రసాద్, మధుసూదన్ చెట్టి, సుబ్రహ్మణ్యం, పీడీ వెంకటేశ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఇండోర్ స్టేడియాన్ని ప్రారంభిస్తున్న అర్జున అవార్డు గ్రహీత చేతన్ ఆనంద్

పౌరాణికంలో రాణిస్తున్న అటవీశాఖ అధికారి

కళ

రుద్రవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏకలవ్య విద్యతో పౌరాణిక పాత్రలో ఫారెస్టు డిప్యూటీ రేంజర్ శ్రీనివాసులు రాణిస్తున్నారు. మయసభలో దుర్యోధనుడిగా, చింతామణిలో భవానీగా, సత్యహరిశ్చంద్రుడిగా పాత్రలో ఆయన ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. ఓ వైపు అటవీశాఖలో ఉద్యోగబాధ్యతలు నిర్వర్తిస్తూనే మరో వైపు ప్రాచీన కళల్లో ఒకటైన పౌరాణిక నాటక రంగంలో తన నటనా వైభవాన్ని చాటిచెబుతున్నారు. కోసిగి మండలం కేంద్రంలో వెంకటరాముడు, మల్లమ్మ దంపతులకు జన్మించిన ఆయన విద్యాభ్యాసం తర్వాత 2008లో ఫారెస్టు డిప్యూటీ ఆఫీసరుగా విధుల్లోకి చేరారు. నంద్యాల డివిజన్‌లోని బండి ఆత్మకూరు ఫారెస్టు రేంజ్‌లో జీఈసాలెం బీట్ ఆఫీసరుగా విధుల్లో చేరారు. రుద్రవరం, నంద్యాలలో పనిచేశారు. ప్రస్తుతం ముద్దనూరు రేంజ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. పౌరాణిక నాటకాలను గురువు లేకుండా ఏకలవ్య విద్యతో పౌరాణిక పద్యాలు నేర్చుకున్నారు. మయసభ దుర్యోధనునిగా, భవానీపాత్రలో, సత్యహరిశ్చంద్ర పాత్రలో నంద్యాల, ఆళ్లగడ్డ, కర్నూలు, అహోబిలం, రుద్రవరం ప్రాంతాల్లో నిర్వహించిన 50 పౌరాణిక నాటకాల్లో మయసభ దుర్యోధనునిగా మరో 10 భవానీ పాత్రల్లో తాను ప్రదర్శనలు ఇచ్చారు.



దుర్యోధనుడిగా శ్రీనివాసులు నాయుడు



భవానీ పాత్రలో పద్యం పాడుతున్న దృశ్యం

పౌరాణికం అంటే ఇష్టంతోనే...



పౌరాణికం అంటే ఇష్టంతో విద్యార్థి దశలోనే పద్యాలు నేర్చుకున్నా. పాఠశాల స్థాయిలోనే పౌరాణిక పద్యాలు పాడుతూ వచ్చా. అప్పటి నుంచి నేటి వరకు గురువు లేకుండానే పద్యాలు నేర్చుకున్నా. మయసభ దుర్యోధనుడిగా, భవానీ పాత్రలో, హరిశ్చంద్రుని పాత్రలు వేస్తున్నా. ప్రజల నుంచి కూడా మంచి స్పందన వస్తోంది.

- శ్రీనివాసులు, డిప్యూటీ రేంజ్ ఆఫీసరు

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

వెలుగు పీడీ శ్రీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి

కోవెలకుంట్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని వెలుగు పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో శనివారం కోవెలకుంట్ల ఏపీఎం శేఖర్ ఆధ్వర్యంలో పొదుపు మహిళలకు నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో కృష్ణమూర్తి, శ్రీనివాసులు పాల్గొని మహిళలకు శిక్షణ ఇచ్చారు. ముఖ్యఅతిథులుగా వెలుగు పీడీ శ్రీధర్ రెడ్డి, డీపీఎం హనుమాన్ నాయక్ పాల్గొన్నారు. ఈసందర్భంగా పీడీ మాట్లాడుతూ జిల్లాలో 16మండలాలను ఆదర్శ మహిళా సమాఖ్య మండలాలలుగా ఎంపిక చేశారన్నారు. ఆ మండలాల్లో మహిళలను చైతన్యపరిచేందుకు మూడు విడతలుగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఐదేళ్ల కాలంలో మహిళా సంఘాలను ఏ విధంగా అభివృద్ధి చేయాలో అనే ప్రణాళికను తయారుచేసి మహిళలను చైతన్య పరచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సీసీలు గోపాల్, రవి, క్రిష్ణమూర్తి, నిర్మల, అకౌంటెంట్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి ఎన్టీఆర్

● బీసీలకు ప్రాధాన్యమిచ్చిన టీడీపీ
● టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

తుగ్గలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అరాచకాలను అరికట్టేందుకు పార్టీని స్థాపించిన ఎన్టీఆర్ బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతిగా చరిత్రలో నిలిచిపోయారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. రాష్ట్రంలో బీసీలకు ప్రాధాన్యమిచ్చిన తెలుగుదేశం పార్టీ ఎంతోమంది బడుగులను చట్టసభలకు పంపిందన్నారు. శనివారం తుగ్గలి మండలంలోని రాతన గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్టీఆర్ కుమారుడు నందమూరి మోహనకృష్ణ, మనుమరాలు మోహనరూప హాజరయ్యారు. ముందుగా వారు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి గజమాలను సమర్పించారు. ఈ కార్యక్రమానికి పత్తికొండ, ఎమ్మిగనూరు ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, జయనాగేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి మాట్లాడుతూ 1980లో డబ్బున్న వారిదే రాజకీయంగా ఉండేదన్నారు. అలాంటిది ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ వల్ల అన్ని వర్గాల ప్రజలు, పేదలు కూడా రాజకీయంగా ఎదిగి ఎమ్మెల్యే, ఎంపీలు, మంత్రులు అయ్యారన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఎన్టీఆర్ పేదలతో నేరుగా కలిసి మాట్లాడేవారన్నారు.

నందమూరి మోహనకృష్ణ మాట్లాడుతూ తెలుగుజాతి పట్ల అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చూపించిన నిర్లక్ష్యం, అవమానాన్ని చూసి ఎన్టీఆర్ తట్టుకోలేకపోయారన్నారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు, బడుగులను రాజకీయంగా తీర్చిదిద్దేందుకు తన తండ్రి ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ ఎన్టీఆర్, కేఈ కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. ఎన్టీఆర్ కర్నూలు పర్యటనకు వచ్చి తమ తాత కేఈ మాదన్నను టీడీపీలోకి ఆహ్వానించి టికెట్ ఇచ్చి గెలిపించారన్నారు. అలాగే తన తండ్రి కేఈ కృష్ణమూర్తి, తనకు తెలుగుదేశం పార్టీ ఎంతో గుర్తింపునిచ్చిందన్నారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతానికి నీరు దక్కుతోందంటే ఎన్టీఆర్ పుణ్యమే అన్నారు. ఎమ్మెల్యే జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కూడా అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగించి ఎన్టీఆర్ కలలు నిజం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నిర్మాత వైవీఎస్ చౌదరి, వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, విగ్రహదాత పారా రామచంద్రప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకులు తుగ్గలి నాగేంద్ర, మనోహర్ చౌదరి, బత్తిన వెంకట్రాముడు, కృష్ణమూర్తి చౌదరి, తిరుపాల్ నాయుడు, మాజీ జడ్పీటీసీ సభ్యులు వరలక్ష్మి, పురుషోత్తం చౌదరి, సంజీవ, రవి, రాజన్న యాదవ్, శ్రీనివాసులు, కోటేష్ చౌదరి, దేవేంద్ర, కేఈ రుద్ర ఫణి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మోహన కృష్ణ, వైవీఎస్ చౌదరితో మాట్లాడుతున్న కేఈ శ్యాంబాబు



రాతనలో జెండా ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

రాయలసీమ అంటే ప్రత్యేక అభిమానం

టీడీపీని స్థాపించి మొట్టమొదటి ఎన్నికల్లో మూడు నియోజకవర్గాల్లో మా తాత ఎన్టీఆర్ పోటీ చేసి గెలుపొందారు. వాటిలో అనంతపురం జిల్లా హిందూపూరం నియోజకవర్గం మాత్రమే ఎంచుకున్నారు. అలాగే మా పెద్దనాన్న హరికృష్ణ హిందూపురం నియోజకవర్గం నుంచే పోటీ చేసి గెలుపొందారు. మూడు పర్యాయాలుగా మా బాబాయ్ బాలకృష్ణ హిందూపురం నుంచే పోటీ చేసి గెలుపొందారు. రాయలసీమపై మా కుటుంబానికి ఎనలేని ప్రేమ ఉంది. తాత ఎన్టీఆర్ జీవితం ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలి. ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ ఎక్కడ చేపట్టినా మా కుటుంబం నుంచి ఎవరో ఒకరం కచ్చితంగా హాజరవుతాం.

- మోహన రూప, ఎన్టీఆర్ మనుమరాలు


గేట్ల ఏర్పాటు కోసం పూజలు చేసి ప్రారంభిస్తున్న బోర్డు అధికారులు


డ్యాంకు సమీపంలో గేట్ల తయారీ


ఫ్యాబ్రికేషన్ చేసిన గేట్లను డ్యాం వద్దకు తరలిస్తున్న వాహనం

తుంగభద్రతకు చర్యలు

(5వ పేజీ తరువాయి)

● పాత గేట్ల తొలగింపు పనులు

తుంగభద్ర డ్యాం 33 గేట్లు కొత్తగా ఏర్పాటు చేసేందుకు రూ.44 కోట్లతో టెండర్లు పిలిచారు. గుజరాత్‌కు చెందిన 'హార్డ్‌వేర్ టూల్స్' సంస్థ టెండరు దక్కించుకుంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో జూలై నుంచి జలాశయంలోకి వరద మొదలు కావడంతో ఆ సమయంలో గేట్లు ఏర్పాటు పనులు మొదలు పెట్టలేదు. అయితే గేట్ల తయారి (ఫ్యాబ్రికేషన్) పనులు మాత్రం కాంట్రాక్ట్ సంస్థ చేపట్టింది. ఇప్పటికే 15 గేట్లు తయారు చేశారు. వీటిని అమర్చాలంటే పాత గేట్లు తొలగించాల్సి ఉంది. ఆ పనులను శుక్రవారం మొదలు పెట్టారు. బోర్డు సెక్రెటరీ ఓఆర్‌కే రెడ్డి, ఎస్ఈ నారాయణ నాయక్, బోర్డు కర్ణాటక సభ్యుడు కృష్ణమూర్తి కులకర్ణి, మునిరాబాద్ ఎస్ఈ, విజయనగర (హోస్పెట్) జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఆర్డీఓ సహా ఏపీ, కర్ణాటక రైతులు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. తుంగభద్రమ్మకు జలహారతి ఇచ్చారు. తరువాత గేట్ల తయారి, అమరిక టెక్నికల్ సిబ్బంది పాత గేట్లను తొలగించే పనులు మొదలు పెట్టారు. సోమవారం నుంచి దాదాపు 80 మందితో పనులు వేగంగా చేపడుతామని బోర్డు ఎస్ఈ నారాయణ నాయక్ ఆంధ్రజ్యోతికి వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 2026 జూన్ ఆఖరులోగా కొత్త గేట్లు ఏర్పాటు చేసే దిశగా ముందుకు వెళ్తామన్నారు.

● జపాన్ నుంచి బేరింగులు దిగుమతి

టీబీపీ డ్యాంకు ఏర్పాటు చేసే గేట్లకు బేరింగులు ఎంతో కీలకం. మన దేశంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన బేరింగ్స్ అందుబాటులో లేకపోవడంతో జర్మని నుంచి దిగుమతి చేసుకోవాలని అనుకున్నారు. అక్కడ కూడా అదే పరిస్థితి ఉండడంతో ఒక్కో గేటుకు 12 చొప్పున 396 బేరింగులు దిగుమతి చేసుకున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. ఇందుకోసం రూ.2.50 కోట్లు ఖర్చు చేశారు. గేట్లు ఎత్తడం, దించడంతో బేరింగులు అత్యంత కీలకమని, అందుకే జపాన్ నుంచి దిగుమతి చేసుకోవాల్సి వచ్చిందని ఏపీ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మెకానికల్ సలహాదారు కన్నయ్యనాయుడు పేర్కొన్నారు.

● నిధులు ఇవ్వని కర్ణాటక

డ్యాం నిర్వహణ, మరమ్మతులు.. వంటి పనులకు ఏపీ ప్రభుత్వం 55 శాతం, కర్ణాటక ప్రభుత్వం 45 శాతం వాటా నిధులు చెల్లించాల్సి ఉంటుంది. 33 గేట్లలో ఏపీ నిర్వహణలోకి 15 గేట్లు, కర్ణాటక నిర్వహణలోకి 18 గేట్లు వస్తాయి. మొత్తం 33 గేట్లు కొత్తగా ఏర్పాటు కోసం రూ.44 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారు. ఇందులో ఏపీ వాటా నిధులు రూ.20 కోట్లు ఇప్పటికే టీబీపీ బోర్డు విడుదల చేసినట్లు ఏపీ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మెకానికల్ సలహాదారు కన్నయ్యానాయుడు వివరించారు. అయితే ఈ నిధుల విషయంపై కర్ణాటకకు లేఖ రాశామని, రెండు మూడు రోజుల్లో ఆ రాష్ట్రం కూడా వాటా నిధులు విడుదల చేస్తుందని బోర్డు ఎస్ఈ నారాయణ నాయక్ ఆశాభావం వ్యక్తం చేశారు.



విషగుళికలు మింగి వ్యక్తి బలవన్మరణం


శరత్‌కుమార్(ఫైల్)

కొలిమిగుండ్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విష గుళికలు మింగి ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల కేంద్రమైన కొలిమిగుండ్లలోని జగనన్న కాలనీలో చోటుచేసుకున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. వివరాలు.. అనంతపురం జిల్లా యాడికి మండలం నగరూరుకు చెందిన శరత్‌కుమార్(25) శుక్రవారం రాత్రి కొలిమిగుండ్లలోని జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న తనమిత్రుడు హరీశ్ గదికి వచ్చాడు. హరీశ్ అల్ట్రాటెక్ పరిశ్రమలో పనిచేస్తూ ఈకాలనీలో నివాసం ఉంటున్నాడు. కొన్ని సమస్యలు ఉన్నాయని, రెండు రోజులు ఇక్కడే ఉంటానని అతడు మిత్రుడితో చెప్పాడు. శనివారం హరీశ్ డ్యూటీకి వెళ్లిపోయాడు. కాసేపటికే రూమ్‌లోఉన్న శరత్‌కుమార్ తాను విషగుళికలు మింగానని హరీశ్‌కు వాయిస్ మేసేజ్ చేశాడు. అతడు ఇంటికి చేరుకొని అపస్మారక స్థితిలో ఉన్న శరత్‌ను తాడిపత్రికి, అక్కడి నుంచి అనంతపురం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శరత్‌కుమార్ మృతి చెందాడు. మృతుడికి నెల రోజుల క్రితమే బళ్లారి జిల్లా సుగ్నీవ్ కొట్టాల గ్రామానికి చెందిన సుష్మితతో వివాహమైంది. ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రొటేషన్ పద్ధతిలో హెచ్‌వోడీ పోస్టులు ఇవ్వాలి



ప్రిన్సిపాల్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏపీజీడీఏ అధ్యక్షుడు డా. బ్రహ్మజీ మాస్టర్

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనల ప్రకారం రొటేషన్ పద్ధతిలో ప్రొఫెసర్లకు హెచ్‌వోడీ పోస్టులను కేటాయించాలని ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డా.పి. బ్రహ్మజీ మాస్టర్ కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు వినతి పత్రం సమర్పించారు. శనివారం వైస్ ప్రెసిడెంటు డా. రామశివనాయక్, అనస్థీషియా ప్రొఫెసర్ డా. సుధీర్‌తో కలిసి ఆయన ప్రిన్సిపాల్‌ను కలిశారు. ఈ సందర్భంగా డా. బ్రహ్మజీ మాస్టర్ మాట్లాడుతూ ఎన్ఎంసీ ప్రకారం హెచ్‌వోడీ పోస్టులను రోటేషన్ పద్ధతిలో కేటాయించాలని కోరారు. ఈ విధానంలో తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో అందరికీ అవకాశం కల్పిస్తున్నారన్నారు. సీనియారిటీ పేరుతో కొందరు ఏళ్ల తరబడి హెచ్‌వోడీలుగా కొనసాగుతున్నారని అన్నారు.

రైతులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న కే. ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునాటి ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కేకే భవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోలేదనీ, అన్ని రకాల పంట ఉత్పత్తుల ధరలు పతనమై రైతులు ఇబ్బందిపడుతున్నారని అన్నారు. కరువు కాటకాల్లో తుఫాను సందర్భాల్లో నష్టపోయిన పంటలకు స్వచ్ఛంద బీమా పథకం ద్వారా ఆదుకుంటామని చెప్పారని గుర్తు చేశారు. సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర పాల్గొన్నారు.

జిల్లాలో వంద రోజుల ప్రణాళిక

● డీఈవో శామ్యూల్ పాల్



కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాలపై ఉపాధ్యాయులు యుద్ధం చేయాల్సిందేనని ఎన్ని సంక్లిష్టతలు ఉన్నా అధిగమించి విద్యార్థులను ఉత్తీర్ణులు చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ అన్నారు. శనివారం కోడుమూరు ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి స్టడీ అవర్స్ తరగతులను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు సులభతరం చేయాలని, మానసికమైన ఒత్తిడిని దూరం చేసి పాఠ్యాంశాలను అవగాహన కల్పించడంలో సఫలీకృతులు కావాలన్నారు. మనకిప్పుడు యుద్ధ వాతావరణం నెలకొని ఉందని అందరం అధిగమించాల్సిందేనని హితువు పలికారు. ఉపాధ్యాయులతోనూ, విద్యార్థులతోనూ విడివిడిగా సమావేశమై సందేహాలను నివృత్తి చేశారు.

నేడు ఎన్ఎంఎంఎస్ స్కాలర్ పరీక్ష

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 నుంచి 1 గంటల వరకు ఈ పరీక్ష జరుగుతుందన్నారు. ఈపరీక్షకు మొత్తం 4,120 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. కర్నూలు, ఆదోని, పత్తికొండ డివిజన్లలో మొత్తం 20 పరీక్ష కేంద్రాలను ఏర్పాట్లు చేశామన్నారు. ఈ పరీక్షకు సంబంధించి 20 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 20 మంది డిపార్టుమెంటు ఆఫీసర్లు, ముగ్గురు ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఆఫీసర్లను నియమించారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

● ఐదుగురికి గాయాలు

● దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ఆటో ప్రమాదం


నాగేంద్రమ్మ (ఫైల్)


హనుమక్క (ఫైల్)

ప్యాపిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలేబాదు గ్రామం సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు మృతి చెందగా మరో ఐదుగురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని పోలీసులు 108 అంబులెన్స్‌లో డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కర్నూలు జిల్లా క్రిష్ణగిరి మండలంలోని రామక్రిష్ణాపురం గ్రామానికి చెందిన 9 మంది మహిళలు ఈ నెల 4న ఆటోలో కడప జిల్లా పోరుమామిళ్ల దగ్గరలోని జ్యోతి నందుల కాశిరెడ్డి నాయన ఆశ్రమానికి వెళ్లారు. ఆ రోజు స్వామిని దర్శించుకొని అక్కడే నిద్రించారు. 5న అవుకు మండలంలోని సీతారాంపురంలో నిర్వహిస్తున్న కాశిరెడ్డి నాయన ఆరాధన ఉత్సవాలలో పాల్గొన్నారు. ఆ రాత్రి మహిళలంతా సొంత ఊరికి బయలుదేరారు. మార్గమధ్యంలోని అలేబాదు గ్రామం సమీపంలోని వినాయకుడి గుడి దగ్గర మలుపులో ఆటో అదుపు కాక బోల్తా పడింది. ఈ ప్రమాదంలో హనుమక్క(66), నాగేంద్రమ్మ(58) మృతి చెందగా కళావతి, అయ్యమ్మ, సోమక్క, మద్దమ్మ, లక్ష్మమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. రాచెర్ల ఎస్ఐ రమేష్ బాబు తమ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను 108 అంబులెన్స్ డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న సోమక్క, అయ్యమ్మను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కూలీ పనులకు వస్తూ.. అనంత లోకాలకు..

● బైకును ఢీకొన్న ట్రాక్టర్.. మహిళ దుర్మరణం

● మరో ఇద్దరికి గాయాలు


సరస్వతి (ఫైల్)


ఆసుపత్రి వద్ద రోదిస్తున్న మృతురాలి బంధువులు

ఆదోని రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కూలీ పనులకు వెళ్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళా కూలీ దుర్మరణం చెందింది. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈఘటన మండలంలోని కపటి శివారులో శనివారం చోటుచేసుకున్నట్లు ఇస్వీ ఎస్ఐ మహేష్‌కుమార్ తెలిపారు. వివరాలు.. పెద్దకడుబూరు మండలం తారాపురానికి చెందిన దంపతులు గిరిస్వామి, సరస్వతీ(25). వారు కూలీ పనుల నిమిత్తం ప్రతి రోజు బైక్‌పై ఆదోనికి వస్తారు. శనివారం భార్యాభర్తలతో పాటు గిరిస్వామి తండ్రి ఉరుకుందప్ప కూడా బైక్‌పై బయలుదేరారు. వీరి వాహనం ఆదోని మండలం కపటి శివారుల్లోకి రాగానే గరుసును తరలిస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. అందరూ కిందపడిపోగా. సరస్వతీపై నుంచి ట్రాక్టర్ దూసుకెళ్లింది. రెండు కాళ్లు విరిగి, తల పగిలి ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. గిరిస్వామి, ఉరుకుందప్ప గాయపడగా వారిని స్థానికులు ఆదోని ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి భర్తతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. తల్లిని కోల్పోయిన పిల్లలను ఎవరు చూసుకోవాలంటూ మృతురాలి బంధువులు రోధిస్తున్న తీరు చూపరులను కలిచివేసింది. ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని డ్రైవర్ అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మార్చురీ వద్ద పోలీసులతో..

గ్రామానికి చెందిన ఓ సీనియర్ టీడీపీ నాయకుడు గరుసు దందాకు పాల్పడుతున్నాడు. ట్రాక్టర్ డ్రైవర్ అశోక్ కూడా మైనరేనని, అతనికి లైసెన్స్ కూడా లేదు. ట్రాక్టర్ డ్రైవర్, యజమాని వచ్చేంతవరకు పోస్టుమార్టం చేయించేది లేదని మృతురాలి బంధువులు మార్చురీ వద్ద పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఆ టీడీపీ నాయకుడు కూటమికి చెందిన మహిళా నాయకురాలికి అనుచరుడు కావడంతో ఆమె ఎలాగైనా పంచాయితీ చేసి ఆర్థికసాయం చేస్తామని అధికారులను వేడుకొంది. మృతురాలి బంధువులకు రూ.6లక్షలు ఇవ్వడానికి గరుసు దందాదారులు ముందుకొచ్చినట్లు విశ్వసనీయ సమాచారం.

స్క్రబ్ టైఫస్‌పై భయం వద్దు: కలెక్టర్


వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ వ్యాధి మనిషి నుంచి మనిషికి వ్యాపించదని, దీనిపై ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని కలెక్టర్ సిరి అన్నారు. శనివారం కలెక్టరేట్ లోని తన చాంబరులో కలెక్టర్ స్క్రబ్‌టైఫస్ వ్యాధిపై కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డా.బి. విజయానందబాబు, మెడిసిన్ హెచ్‌వోడీ డా.డి.శ్రీరాములుతో కలిసి సమీక్ష నిర్వహించారు. కర్నూలు జీజీహెచ్‌లో స్క్రబ్ టైఫస్ కేసులు ఇప్పటివరకు 44 పాజిటివ్ కేసులు వచ్చాయని, ఇందులో 39మంది రోగులు డిశ్చార్జ్ చేశామని, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో 5 మంది చికిత్స పొందుతున్నారన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ వ్యాధిపై ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని అప్రమత్తంగా ఉంటే సరిపోతుందన్నారు. రైతులు పొలాల్లో, పొదల్లో ఉన్నప్పుడు జాగ్రత్తగా ఉండాలని, పూర్తిగా ఒంటిని కప్పి ఫుల్‌షర్టులు, వ్యవసాయంలో ఫుల్ రబ్బరు బూట్లు, ప్యాంట్లు ధరించాలని సూచించారు.జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా. ఉమాదేవి, పల్మనాలజీ హెచ్‌వోడీ డా.శ్రీకాంత్, పాల్గొన్నారు.

కార్పొరేటర్ హల్‌చల్

కర్నూలు క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఓ కార్పొరేటర్ ట్రాఫిక్ పోలీసులపై హల్‌చల్ చేశాడు. శనివారం సాయంత్రం ట్రాఫిక్ పోలీసులు గౌరి గోపాల్ హస్పిటల్ సమీపంలో హెల్మెట్‌ధారణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి జరిమానాలు విధిస్తున్నారు. అటుగా వెళ్తున్న కార్పొరేటర్‌ను కూడా ట్రాఫిక్ పోలీసులు ఆపారు. తను కార్పొరేటర్‌ను అంటూ.. తనను పంపించాలని ట్రాఫిక్ పోలీసులతో వాగ్వావాదానికి దిగాడు అప్పటికే పెద్ద ఎత్తున వాహనాలు ఉండటంతో కాసేపు పక్కకు ఉండాలని ట్రాఫిక్ సీఐ సూచించారు. దీంతో అసహనానికి గురైన కార్పొరేటర్ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ హల్‌చల్ చేశాడు. తీరా చేసేదేమీ లేక పోలీసులు ఆయన్ను పంపించేశారు. గతంలో వైసీపీ ప్రభుత్వంలో ఉన్న కార్పొరేటర్.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత టీడీపీలో చేరాడు. కూటమి ప్రభుత్వం వచ్చాక వైసీపీ నుంచి టీడీపీలోకి జంప్ అయిన ఈ కార్పొరేటర్ తీరు తరచూ వివాదాలకు తావిస్తోంది.

హ్యాండ్‌బాల్ విజేత కర్నూలు జట్టు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహించిన 11వ రాష్ట స్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ పోటీల విజేతగా కర్నూలు జిల్లా జట్టు నిలిచిందని పోటీల నిర్వాహక కార్యదర్శి డా. రుద్రరెడ్డి తెలిపారు. ఫైనల్స్‌లో వైజాగ్ జిల్లా జట్టుపై కర్నూలు జట్టు 19-16 గోల్స్ తేడాతో గెలుపొంది చాంపియన్‌గా నిలిచింది. రెండో స్థానంలో వైజాగ్ నిలువగా, మూడో స్థానంలో వెస్ట్ గోదావరి జట్టు, ఈస్ట్ గోదావరి జిల్లా జట్టు సంయుక్తంగా నిలిచాయి. ఈ సందర్భంగా శనివారం స్టేడియంలో ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, జిల్లా ఒలంపిక్ సంఘం సీఈవో విజయకుమార్, ఒలంపిక్ కార్యనిర్వహణ కార్యదర్శి సునీల్ కుమార్, అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు వెంకటేశ్, సీనియర్ క్రీడాకారుడు ఫణీంద్రలు హాజరై బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 15-20 తేదీలలో కోల్‌కత్తా వేదికగా జరగబోయే 54వ జాతీయ స్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు పాల్గొని విజేతలుగా నిలవాలన్నారు.

పోలీసుల అదుపులో రౌడీషీటర్

కర్నూలు క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శరీన్‌నగర్‌కు చెందిన ఓ రౌడీషీటర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానికంగా ఉన్న ఓ వ్యక్తిపై ఆ రౌడీషీటర్ బెదిరింపులకు పాల్పడటంతో ఆ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఆ రౌడీషీటర్‌పై పలు హత్యా, హత్యాయత్నం కేసులు ఉన్నాయి.

12 లోగా అక్రిడిటేషన్లు కోసం నమోదు చేసుకోవాలి

● సమాచార పౌర సంబంధాల శాఖ జిల్లా చైర్మన్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు నూతన అక్రిడిటేషన్ల కోసం వెబ్‌సైట్‌లో డిసెంబరు 12లోగా రిజిస్ట్రేషన్, నమోదు ప్రక్రియ పూర్తిచేసుకోవాలని సమాచార పౌర సంబంధాలశాఖ జిల్లా చైర్మన్, కలెక్టర్ రాజకుమారి శనివారం తెలిపారు. 2026- 27 ఏడాదికి సంబంధించి జిల్లాలో అర్హత కలిగిఉన్న వర్కింగ్ జర్నలిస్టులు నూతన అక్రిడిటేషన్ల కోసం మంచి అవకాశమని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ప్రక్రియ రెండు దశల్లో ఉంటుందని, మొదట రిజిస్ట్రేషన్ చేసుకొని, తర్వాత డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేసి డాక్యుమెంట్లను, దరఖాస్తు ప్రతిని డీపీఆర్‌వో కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

37వ ఈఎన్‌టీ శస్త్ర చికిత్స శిబిరం


వైద్యులకు శిక్షణ ఇస్తున్న డా.జయప్రకాష్ రెడ్డి

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎన్ఆర్‌పేటలో ఉన్న శ్రీసత్యసాయి ఈఎన్‌టీ హాస్పిటల్‌లో శనివారం 37వ హ్యాండ్స్ అన్ అసికులో ప్లాస్టీ, టింపనో ప్లాస్టీ, మైక్రో ఇయర్ సర్జరీల రెండు రోజుల వర్క్‌షాపును ఈఎన్‌టీ స్పెషలిస్టు డా.బి.జయప్రకాష్ రెడ్డి నిర్వహించారు. ఈ వర్క్‌షాపుకు మణిపూర్, ఢిల్లీ, కర్ణాటక, ఒడిశా, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 20 మంది కొత్త వైద్యులు పాల్గొన్నారు. నూతన వైద్యులకు ఈఎన్‌టీ శస్త్ర చికిత్స నిపుణులు డా.బి.జయప్రకాష్ రెడ్డి, చెవి, ముక్కు సంబంధించిన సూక్ష్మమైన ఎముకలను, ఇతర పరికరాలను సేకరించారు. డా.జయప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా ఈఎన్‌టీ శస్త్ర చికిత్సలపై వైద్యులకు శిక్షణకు అందిస్తున్నట్లు తెలిపారు. చెవి, లోపలి భాగంలో ఉన్న సూక్ష్మమైన ఎముకలు వివిధ కారణాల వల్ల దెబ్బతిన్నప్పుడు రోగులకు వినికిడి లోపం కలుగుతుందన్నారు.

సీనియర్ పర్యావరణ ఇంజనీరుకు పదోన్నతి

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ పర్యావరణ ఇంజనీరు ఎస్.శంకర్ నాయక్ పదోన్నతిపై బదిలీ అయ్యారు. కర్నూలులోని ఏపీ పీసీబీ జోనల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఈయనను సంయుక్త ముఖ్య పర్యావరణ ఇంజనీరుగా పదోన్నతి కల్పిస్తూ విశాఖపట్టణానికి బదిలీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన స్థానంలో సీనియర్ పర్యావరణ ఇంజనీరుగా ప్రస్తుతానికి ఎవరిని నియమించలేదు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కర్నూలు అర్బన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఇన్‌చార్జి ఉపకులపతి వి. వెంకట బసవరావు అన్నారు. శనివారం క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని సిల్వర్ జూబ్లీ కళాశాల విద్యార్థినులకు తుంగభద్ర హస్టల్ నూతన డైనింగ్ హాలును రిజిస్ట్రార్ జీ. శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రుచి, శుచి, నాణ్యత ప్రమాణాలు విద్యార్థులకు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీన్లు నగరాజు శెట్టి, అక్తర్ భాను, ఆధ్యాపకులు ఎం పార్వతి, ఓబులేస్. సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

సి. బెళగల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో రాణెమ్మ అన్నారు. శనివారం మండల కేంద్రం, పోలకల్లు, ఇనగండ్ల, గుండ్రేవుల గ్రామాలలో పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో పరిసరాల పరిశుభ్రత లోపించకుండా చూడాలని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. ఎంపీడీవో వెంట ఆయా గ్రామాల పంచాయతీకార్యదర్శులు ఉన్నారు.

పనికి తగిన వేతనం అందించాలి


వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

కోడుమూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లకు పనికి తగిన వేతనం ఇవ్వాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు జీపీ వీరన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీడీపీవో కార్యాలయం ముందు శనివారం నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడిలకు నెలకు రూ.26వేల వేతన అందించాలని అన్నారు. అంతే కాకుండా ప్రభుత్వ పథకాలు కూడా వర్తించే విధంగా ప్రభుత్వం తగు జీవోలను విడుదల చేయాలని అన్నారు. అంగన్‌వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం 12న కర్నూలు కలెక్టర్ ఆఫీసు ముందు నిర్వహించే ధర్నా నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ ముర్తుజాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడి వర్కర్లు చంద్రమ్మ, సుజాత, సువర్ణ, హైమావతి, అరుణ, రజియా తదితరులు పాల్గొన్నారు.

పంచలింగాల కేజీబీవీ తనిఖీ


పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న లోక్‌రాజ్

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచలింగాలలోని కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలను శనివారం సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ డా.ఎన్‌బీ లోక్‌రాజు, కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ డా.వై.దనరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. అనంరం పదో తరగతి పరీక్షల వంద రోజుల కార్యచరణ ప్రణాళిక అమలును పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పరిశీలించి వంద శాతం ఫలితాలు సాధించడానికి విద్యార్థులకు కఠిన అంశాలను బోధించాలని సూచనలు చేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ డా.ఎన్‌బీ లోక్‌రాజు మాట్లాడుతూ అన్ని కేజీబీవీ పాఠశాలను తప్పకుండా సందర్శిస్తానని, లోపాలు గుర్తిస్తే ఎంత మాత్రం ఉపేక్షించేది లేదన్నారు. కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ డా.ధనరాజు విద్యార్థులలో పరీక్షలు- సంసిద్ధత అనే అంశంపై విద్యార్థులకు మార్గదర్శనం చేశారు.

రహదారి భద్రత నియమాలు పాటించాలి

కర్నూలు క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు రహదారి భద్రతా నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు. శనివారం స్థానిక బుధవారపేట కోట్ల స్మారక భవనం వద్ద మోటారు సైకిల్ నడిపేవారికి ట్రాఫిక్ పోలీసులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ద్విచక్రవాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్లు ధరించాలని, ఓవర్ స్పీడ్, ఓవర్‌లోడుతో వాహనాలు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నా రు. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ

సి. బెళగల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట సమీపాన రాఘవేంద్ర స్వామి మఠంలో మన్మధ్వాచార్యులు, ఆంజనేయ విగ్రహాలను శనివారం మంత్రాలయం పీఠాధిపతులు సుబుధేంద్రతీర్థులు ప్రతిష్ఠించారు. ఈకార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ పెద్దలు లక్ష్మణదాసు, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే గడ్డం ప్రకాశ్‌రెడ్డి, సర్పంచ్ బెల్లం శ్రీనివాసులు, భక్తులు పాల్గొన్నారు.

మహనీయుడు బాబా సాహెబ్ అంబేడ్కర్


అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

కర్నూలు అర్బన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలకు ముందు చూపుతో రాజ్యాంగ ఫలాలు అందించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ 69వ వర్ధంతి ఆయన చిత్ర పటానికి మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ధరూర్ జేమ్స్, మాల కార్పొరేషన్‌డైరెక్టర్ పోతురాజు రవీకుమార్‌లతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పెరపోగు రాజు, అశోక్, చంద్రప్ప, బోగ్గుల ప్రవీణ్, నాగరాజు గౌడ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఎంపి బస్తిపాటి నాగరాజు అన్నారు. శనివారం ఢిల్లీలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పార్లమెంట్ ప్రాంగణంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

● జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ 69వ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మహేంద్ర నాయుడు, కోడుమూరు ఇన్‌చార్జీ అనంత రత్నం మాదిగ, ఐన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి. బ్రతుకన్న, షేక్ ఖాజా హుస్సేన్ , ఖాద్రీ పాషా, బీ. సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

● సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 70వ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్

ఘనంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి

విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో క్లస్టర్ వర్శిటీ ఇంచార్జీ ఉపకులపతి వి. వెంకట బసవరావు, రిజిస్ట్రార్ జీ. శ్రీనివాస్, డీన్లు నాగరాజ శెట్టి, అక్తర్ భాను, మహమ్మద్ వాహిజ్, ఆధ్యాపకులు ఎల్లా కృష్ణ, బంగారు బాబు, ఫమీదా భేగం, తదితరులు పాల్గొన్నారు.

● డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ షావలీ ఖాన్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈకార్యక్రమంలో రిజిస్ట్రార్ లోక్ నాథ్, ఆధ్యాపకులు పాల్గొన్నారు.

● రాయలసీమ యూనివర్సిటీలో ఉపకులపతి వి. వెంకట బసవరావు, రిజిస్ట్రార్ విజయకుమార్ నాయుడు, ప్రిన్సిపాల్స్ సీ. విశ్వనాథరెడ్డి, సుందరానంద పుచ్చాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు నివాళి అర్పించారు. కార్యక్రమంలో డీన్ భరత్, ఇతర ఆధ్యాపకులు పాల్గొన్నారు.

● నగరంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల వేదిక కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

కర్నూలు ఎడ్యుకేషన్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి.. ఆయన స్ఫూర్తి భావాలను యువతలో నాటడం, విద్యాహక్కులు, సామాజిక సమానత్వంపై అవగాహన కల్పించడం అత్యంత అవసరమని ఎస్సీ సంక్షేమ, సాధికారత జిల్లా అధికారి రాధిక అన్నారు. డా. బీఆర్ అంబేడ్కర్ 69వ వర్ధంతి సందర్భంగా శనివారం సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో ప్రగాఢ నివాళులర్పించారు.

● అలాగే మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాసారపు వెంకటేశ్ నవ్యాంధ్ర జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆవుల అయ్యస్వామి, అంబేడ్కర్ స్టూడెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుకృష్ణ, డీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శరత్ పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆఫీసు కార్యాలయ పర్యవేక్షకులు ఆలీబాషా, మనోహర్, ఏఎవో గద్ద రవికుమార్, విజయకుమార్, నిజాముద్దీన్, షేక్షావలి, శశికుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

● బీ. క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో డా. బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. నాగస్వామి నాయక్ హాజరై డా. బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రసన్న కుమార్, సోమేష్, పార్థసారధి, పటేల్, చిన్న మల్లేశ్వరుడు, ఉల్గోజిరావు, శ్రీధర్ పాల్గొన్నారు.

కల్లూరు: దేశ నిర్మాణంలో డా.బీఆర్. అంబేడ్కర్ పాత్ర చిరస్మరణీయమని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి కొనియాడారు. శనివారం కల్లూరులోని ఇందిరమ్మకట్ట సమీపంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కె. పార్వతమ్మ, ఇబ్రహీం, ఎస్. పిరోజ్ పాల్గొన్నారు

కర్నూలు న్యూసిటీ: అంబేడ్కర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలని కేవీపీఎస్ నగర అధ్యక్షుడు ఆర్.రమణ అన్నారు. శనివారం డా.బీఆర్. అంబేడ్కర్ 69వ వర్ధంతిని పురస్కరించుకుని జోహరాపురంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, విజయరామాంజనేయులు, మహమూద్, రంగస్వామి, మధు, మౌలాలి పాల్గొన్నారు.

కోడుమూరు: పట్టణంలో మాలమహానాడు ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ 69వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బిరుకుల మునిస్వామి స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలను వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు సింగరయ్య, భీముడు, తిక్కన్న, రాజు, దాసు, హరి, రంగముని పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి


కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..


కోడుమూరులో...


కర్నూలు: సంక్షేమ శాఖ కార్యాలయంలో..

నగర పాలక స్టాండింగ్ కమిటీ సమావేశం వాయిదా

● విభాగ అధికారుల నిర్లక్ష్యం..

● విభాగ అధికారులకు నోటీసులు జారీ



కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగర పాలక స్టాండింగ్‌కమిటీ సమావేశం వాయిదా పడింది. శనివారం జరగాల్సిన స్టాండింగ్ కమిటీ సమావేశం కేవలం నగర పాలక విభాగ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వాయిదా పడిందని తెలిసింది. సమావేశానికి వారం రోజుల ముందుగానే వివిధ సెక్షన్ల నుంచి అభివృద్ధి పనులకు సంబంధించి సమావేశంలో ఆమోదించడానికి ప్రతిపాదనలను అజెండా రూపంలో సిద్ధం చేయాలి. అయితే సమావేశం ఉందనుకుని కమిటీ చైర్మన్, మేయర్ బీవై. రామయ్య హాజరయ్యారు. సమావేశానికి ఎవరూ రాకపోవడంతో ఆయన కూడా వెనుతిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఈ నెల 6న స్టాండింగ్ కమిటీ సమావేశం ఉంటుందని, గత వారం రోజుల క్రితమే నగర పాలక కార్యదర్శి నాగరాజు అన్ని విభాగాల అధికారులకు తక్షణమే ప్రతిపాదనలు పంపాలని సమాచారం అందించారు. అయిన కూడా ఇంజనీరింగ్, రెవెన్యూ, ప్రజారోగ్య శాఖల నుంచి ఎలాంటి ప్రతిపాదనలు రాలేదు. ఈ నేపథ్యంలో చివరి నిమిషంలో ప్రతిపాదనలు రావడంతో వాటిని సంబంధిత కమిటీ సభ్యులకు సమాచారం అందించారు. అయితే చివరి నిమిషంలో వచ్చిన ప్రతిపానదలను కమిటీ సమావేశంలో ఏ విధంగా ఆమోదిస్తామని సభ్యులు మండిపడ్డారు. ఈ విషయాన్ని కార్యదర్శి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత అధికారులకు షోకాజు నోటీసులు జారీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. 60 రోజులకు ఒక్కసారి జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని కూడా సక్రమంగా నిర్వహించలేకపోతున్నారని కమిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదేనా కూటమి ప్రభుత్వ పాలన అని సభ్యులు మండిపడుతున్నారు.

హౌసింగ్ సిబ్బంది తీరుపై ఎంపీటీసీ ఆగ్రహం

●సర్వసభ్య సమావేశంలో నేలపై కూర్చుని నిరసన

● విద్యుత్ సిబ్బంది తీరుపై ప్రజాప్రతినిధుల అసహనం


హౌసింగ్ సిబ్బంది తీరుకు వ్యతిరేకంగా నేలపై కూర్చుని నిరసన చేస్తున్న ఎంపీటీసీ మునిస్వామి

కల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హౌసింగ్ శాఖ సిబ్బంది తీరుపై పెద్దటేకూరు ఎంపీటీసీ మునిస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్ల మంజూరైన పేదలు పెద్దఎత్తున ఖర్చు చేసి నిర్మాణం పూర్తి చేసుకోగా వర్క్ ఇన్‌స్పెక్టర్ ఈపథకం మీకు వర్తించదని అంటున్నారని ఆరోపించారు. శనివారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన చేపట్టిన సర్వసభ్య సమావేశంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ తీరుకు నేలపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. అలాగే విద్యుత్‌శాఖ సిబ్బంది ప్రజలకు అందుబాటు లేరని సల్కాపురం సర్పంచు సభ దృష్టికి తెచ్చారు. సల్కాపురంలో లైన్‌మెన్ విధినిర్వహణలో అలసత్వంగా ఉన్నారని రాత్రి వేళల్లో కరెంట్ పోతే పక్క గ్రామాల లైన్‌మెన్‌లకు ఫోన్‌చేసి మరమ్మతు పనులు చేయించుకుంటున్నామని వాపోయారు. ఏ.గోకులపాడులో విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు సిబ్బంది రైతులతో బేరసారాలకు దిగుతున్నారని పద్ధతి మార్చుకోవాలని పర్ల ఎంపీటీసీ సభకు వివరించారు. అంతకు ముందు కల్లూరు మండల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ప్రజలకు మెరుగైన సేవలందించేలా అధికారులు, సిబ్బంది పనిచేయాలని ఎంపీడీవో జి.నాగేషాచలరెడ్డి సూచించారు. కార్యక్రమంలో అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, సెక్రటరీలు పాల్గొన్నారు

వార్డుల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి


కల్లూరులో మురుగుశుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కల్లూరు అర్బన్ 16 వార్డుల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి పేర్కొన్నారు. శనివారం 21, 20, 26, 35 వార్డుల్లో రూ.3.39 కోట్ల అభివృద్ధి పనులకు కమీషనర్ పి.విశ్వనాథ్‌తో కలిసి ఎమ్మెల్యే భూమి పూజలు చేశారు. 21వ వార్డు ఎన్జీవోస్‌కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ-2లో రూ.1.40 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్లు, డబ్ల్యూబీఎం రోడ్డు పనుల ప్రారంభోత్సవం చేశారు. అలాగే 20వ వార్డు వాసవీనగర్, జయరాంనగర్‌లో రూ.50లక్షలతో సీసీ.రోడ్ 26వ వార్డు సవారమ్మకాలనీలో రూ.82 లక్షలతో సీసీ.రోడ్లు, డ్రైన్లు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా 35వ వార్డు ఉమామహేశ్వరనగర్, కల్లూరు ఎస్టేట్ నాగులకట్టలో రూ.67 లక్షలతో డబ్ల్యూబీఎం బీటీ రోడ్డుకు భూమిపూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు ఇన్‌చార్జిలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● కల్లూరు హంద్రీనదిలో ఏర్పాటు చేసిన మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి పరిశీలించారు. శనివారం కార్పొరేషన్ అధికారులు ఎమ్మెల్యేకు మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్వహణ, పనితీరును వివరించారు. కార్యక్రమంలో ఏపీ విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కె.పార్వతమ్మ, అధికారులు పాల్గొన్నారు.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి : డీఈవో


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి శామ్యూల్‌పాల్

కోడుమూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాబోయే పదవ తరగతి పరీక్షలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రణాళిక రచించుకోవాలని ఉపాధ్యాయ బృందాన్ని డీఈవో ఎస్. శామ్యూల్‌పాల్ ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలను పరిశీలించి, విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందరోజుల ప్రణాళికలో భాగంగా విద్యార్థులు పరీక్షలు నిర్వహించి వాళ్ల శక్తి, సామర్థ్యాలను వెలికితీయాలని చెప్పారు. అందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసుకొని ఉపాధ్యాయులు ముందుకు సాగాలన్నారు. ప్రత్యేక క్లాసులు నిర్వహించే సమయంలో విద్యార్థులకు అవసరమైతే అల్పాహారం అందించే విధంగా ఆలోచనలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామచంద్రుడు, ఉపాధ్యాయులు అనితకుమారి, ఎల్లారెడ్డి, సోమశేఖర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బంకులను తొలగించాలి : ఏఐఎస్ఎఫ్

పాఠశాల ప్రహారికి అనుకొని అక్రమంగా ఏర్పాటు చేసుకొన్న బంకులను తొలగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి డీఈవో దృష్టికి తీసుకొచ్చారు. విద్యార్థులకు ఇబ్బందిగా ఉంటే కలెక్టర్‌తో మాట్లాడి బంకులను తొలగించే విధంగా చర్యలు తీసుకొంటామని డీఈవో హామి నిచ్చారు.

అంతర్ కళాశాలల టోర్నమెంటు పోటీలు ప్రారంభం

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలో ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో క్లస్టర్ యూనివర్సిటీ ఇంటర్ కాలేజీయేట్ (అంతర్ కళాశాలల) టోర్నమెంటు పోటీలు క్లస్టర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొ.వెంకట బసవరావు శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మానసిక, శారీరక ఎదుగుదలకు క్రీడలు దోహ దపడుతాయన్నారు. 6న క్రికెట్ (పురుషులకు), 8న ఫుట్‌బాల్ (మహిళలు, పురుషులు)కు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అనుమతి లేని టూవీలర్‌పై చర్యలు తీసుకోవాలి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నాన్ ట్రాన్స్‌పోర్టు వాహనాల్లో ప్రయాణికులకు చేరవేయడాన్ని నిషేధించాలని, అనుమతి లేని టూ వీలర్‌పై చర్యలు తీసుకోవాలని ఆటో కార్మిక సంఘం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా ఉపరవాణా కమిషనర్ ఎస్. శాంత కుమారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభాకర్ మాట్లాడుతూ టూ వీలర్ ద్వారా ప్రయాణికులను చేరవేస్తున్న రాపిడ్ సంస్థను వెంటనే రద్దు చేయాలన్నారు. ఓలా, ఉబర్, రాపిడ్ లాంటి ప్రైవేట్ యాప్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి ఆటో కార్మికులను నిలువు దోపిడికీ గురి చేస్తున్నాయని అన్నారు. ఎలాంటి అనుమతులు అవకాశాలు లేని నాన్ ట్రాన్స్‌పోర్టు వాహనాలైన టూవీలర్లపై ప్రయాణికులను చేరవేస్తూ ఆటో డ్రైవర్ల ఆదాయానికి గండి కొడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో న్యూసిటి ప్రధాన కార్యదర్శి రాధాక్రిష్ణ, ఆటో యూనియన్ నగర అధ్యక్షుడు ఎస్.హుస్సేన్ వల్లి, ఉపాధ్యక్షుడు ఎస్.మాలిక్‌బాషా, ఖలీల్ అహ్మద్ పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే మంత్రి టీజీపై ఆరోపణలు


మాట్లాడుతున్న ఎన్జీవో మాజీ జిల్లా అధ్యక్షుడు ప్రభుదాస్

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏబీసీ క్వార్టర్స్‌ను ఖాళీ చేయించాలని మంత్రి టీజీ భరత్ అందులో హైకోర్టు బెంచు ఏర్పాటు చేయాలనే ఆలోచన ప్రభుత్వ నిర్ణయమని, అయితే కొందరు వైసీసీ నాయకులు రాజకీయ లబ్ధికోసమే మంత్రిపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని ఏపీ ఎన్జీవో మాజీ జిల్లా అధ్యక్షుడు ప్రభుదాస్ మండిపడ్డారు. శనివారం స్థానిక జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న ఏపీ ఎన్జీఓ హోమ్‌లో ఆయన మాట్లాడుతూ మంత్రి టీజీ భరత్‌పై ఏబీసీ క్వార్టర్స్ విషయంలో కొందరు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఏబీసీ క్వార్టర్స్‌లో హైకోర్టు బెంచు ఏర్పాటుకు కృషి చేస్తున్న మంత్రి టీజీ భరత్‌కు ప్రభుత్వ ఉద్యోగుల కు అభినందనలు తెలుపుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సీఎస్టీ గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ మాజీ జిల్లా అధ్యక్షుడు వై.రామయ్య, విశ్రాంత పేఅండ్ అకౌంట్స్ ఆఫీసర్ పి.అబ్సోలమ్ రాజు, రాయలసీమ యూనివర్సిటీ విశ్రాంత ఫిజిక్స్ ప్రొఫెసర్ డా.డి.పుణ్యశేషుడు పాల్గొన్నారు.

ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పించాలి


ఉపకులపతికి వినతి ప్రతం ఇస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

కర్నూలు అర్బన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మాదిగ ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పించాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాయకంటి మద్దయ్య కోరారు. శనివారం రాయలసీమ యూనివర్సిటీలో ఉపకులపతి వి. వెంకట బసవరావును కలిసి వినతి పత్రం ద్వారా కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీరాములు, జయరాజు, దినకర్, జీసీ సుబ్బరాయుడు ఉన్నారు.

ప్రజా కళలను ప్రోత్సహిద్దాం



మాట్లాడుతున్న ఓబులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజల కళలను ప్రోత్సహించాలని, ప్రజలలో దాగి ఉన్న కళలను బయటికి తీసి వాటిని ప్రదర్శించడం ద్వారా కళలను రక్షించడానికి కృషి చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి. ఓబులు కార్మికులకు పిలుపునిచ్చారు. శనివారం కేకే భవన్‌లో రాయలసీమ జిల్లా కళకారుల వర్క్‌షాప్ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఎండి. అంజిబాబు, అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, జిల్లా అధ్యక్షుడు బసవరాజు పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఉద్యోగుల సంక్షేమం ముఖ్యం

కర్నూలు అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ ఎంప్లాయీ అసోసియేషన్‌ఉద్యోగుల సంక్షేమంపై దృష్టి సారించడం అభినందనీయమని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి. శ్రీదేవి అన్నారు. శనివారం ఎక్సైజ్ శాఖ ఆవరణలో జేమ్ కేర్ కామినేని హస్పిటల్ సహకారంతో నిర్వహించిన మెడికల్ క్యాంప్‌లో రక్త దాన శిబిరాన్ని అసిస్టెంట్ కమిషనర్ వి. హనుమంతరావు, సూపరింటెండెంట్ సుధీర్ బాబులతో కలిసి ప్రారంభించారు. 50 మందికి పైగా రక్త దానం చేశారు.

పని చేసేవారికి గుర్తింపు ఉంటుంది

● ఎన్టీఆర్ తనయుడు నందమూరి మోహన కృష్ణ


తిమ్మయ్య చౌదరిని సన్మానిస్తున్న మోహన కృష్ణ

తుగ్గలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో పని చేసిన ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఓపికతో పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసి ముందుకు వెళ్లాలనీ దివంగత ఎన్టీఆర్ తనయుడు నందమూరి మోహన కృష్ణ, మనుమరాలు నందమూరి మోహనరూప అన్నారు. శనివారం మండల పరిధిలోని రాతనలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో పాల్గొని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, తిమ్మయ్య చౌదరి, మనోహర్ చౌదరి, తుగ్గలి నాగేంద్రలతో పాటు స్థానిక నాయకులను మోహనకృష్ణ, మోహనరూపలు సన్మానం చేశారువెంకట్రాముడు చౌదరి, కృష్ణమూర్తి చౌదరి, బాలయ్య, షైరాముడు తదితరులు ఉన్నారు.

సహకార బ్యాంకు ఉద్యోగుల నిరసన

చిప్పగిరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ ఐక్యవేదిక (జేఏసీ) ఇచ్చిన పిలుపు మేరకు శనివారం మండలకేంద్రమైన చిప్పగిరిలోని బెల్డోన సొసైటీ బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది తమ విధులను బహిష్కరించి నిరసన తెలియజేశారు. శనివారం సొసైటీ బ్యాంకు సీఈఓ హరికృష్ణ, ఉద్యోగులు ముక్కన్న, ఓబుళపతి, గౌరమ్మ తదితరులు స్థానిక చిప్పగిరిలోని కార్యాలయం ముందు నిరసనకు దిగారు

నేటి నుంచి ఇండోర్ క్రీడా పోటీలు


మాట్లాడుతున్న రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సైపుల్లా

ఆదోని అగ్రికల్చర్ , డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆదోని జోనల్ స్థాయి ఇండోర్ క్రీడా పోటీలను నేటి నుంచి ఆదివారం మల్లికార్జున విద్యాలయంలో నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సైపుల్ల, ప్రధాన కార్యదర్శి మేఘనాథ్ రెడ్డి తెలిపారు. శనివారం రోటరీ క్లబ్ సభ్యులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెస్, డ్రాయింగ్, రూబిక్ క్యూబ్, వ్యాసరచన, వక్తృత్వ క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. డివిజన్‌ల్లోని ఆయా పాఠశాలల విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొని తమ ప్రతిభ చాటుకోవాలని సూచించారు. క్రీడా పోటీలకు తమ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులకు తెలియజేశామని తెలిపారు. 13వ తేదీన అవుట్ డోర్ క్రీడా పోటీలు జరుగుతాయని తెలిపారు. విజేతలైన విద్యార్థులకు క్రీడా జట్లకు బహుమతులు ప్రధానం చేస్తామన్నారు. రోటరీ క్లబ్ సభ్యులు జీవన్ సింగ్, సునీల్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, ప్రశాంత్, గాంధీ, సందీప్ రెడ్డి, షాబీర్, అహ్మద్ హుస్సేన్, పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఆదోని రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు తమ నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిడిఓ నాగరాజుస్వామి తెలిపారు. శనివారం ఉదయం ఆకస్మికంగా ఇస్వీలో జరిగే ఇంటింటి చెత్త సేకరణ పనులను పరిశీలించారు.

హిందువులందరూ ఐకమత్యంగా ఉండాలి

మద్దికెర, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రాంతాలు వేరైనా, కులాలు వేరైనా హిందువులందరూ అన్నదమ్ముల వలే ఐకమత్యంగా ఉండాలని శ్రీ శాంతానంద ఆశ్రమం పీఠాధిపతి గురుసేవానంద స్వాములు, ఆర్ఎస్ఎస్ సహప్రాంత ప్రచారక్ జనార్దన్ అన్నారు. శ్రీ విద్యాసాయి కళాశాల ఎండీ వెంకటమాధవ్‌తో పాటు హిందూ సమ్మేళన సమితి సభ్యులు, ప్రజలు, హిందువులు పాల్గొన్నారు

శ్మశానంలో అభివృద్ధి పనులు

వెల్దుర్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రమైన వెల్దుర్తి 12వ వార్డు రాణితోట నాందార్ల శ్మశాన వాటికలో శుక్రవారం సింగిల్ విండో చైర్మన్ రమాకాంత్‌రెడ్డి, మండల కన్వీనర్ బలరాంగౌడు పలు అభివృద్ధి పనులు చేపట్టారు ధన్నాడ శివ, రాఘవేంద్ర పాల్గొన్నారు.

వైభవంగా రంగనాథ స్వామికి పూజలు

మద్దికెర, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథస్వామి ఆలయంలో మూలవిరాట్ రంగనాథ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. శనివారం ఆలయంలో మూలవిరాట్ రంగనాథ స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు రంగస్వామి ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి ఆదోని మండలం గోనేబావి గ్రామానికి చెందిన ముత్యాల ఆనంద్ రూ21వేలను ఆలయ చైర్మన్ పారా రవికుమార్‌కు శనివారం అందజేశారు.

రైతుల సంక్షేమానికి కృషి చేస్తాం

చిప్పగిరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన బెల్డోన సొసైటీ బ్యాంకు చైర్మన్ కొండ రామాంజినేయులు అన్నారు. శనివారం వెలుగు అధికారులు, సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. చిన్నకారు, సన్నకారు రైతులకు పంటల సాగుకు రుణాలు అందిస్తామన్నారు. ఏపీఎం శివయ్య, సీసీలు లక్ష్మన్న, శ్రీనివాసులు, కాకర్ల గోవిందప్ప, వీబీకే పెద్దన్న పాల్గొన్నారు.

శబరిమలకు అయ్యప్ప భక్తులు


ఇరుముడులు కట్టుకుంటున్న అయ్యప్ప భక్తులు

మద్దికెర, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో అయ్యప్ప మాలలు ధరించి 41 రోజులు దీక్షలు చేపట్టిన భక్తులు ఇరుముడులు కట్టుకుని శభరిమలైకు బయలుదేరారు. శనివారం మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలోని శ్రీరాముని దేవాలయంలో గురుస్వాముల ఆధ్వర్యంలో ఇరుముడులు కట్టుకుని బయలుదేరి వెళ్లారు.

నూతన మండలానికి ప్రజల అండ

ఆదోని, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ప్రకటించబడిన పెద్దహరివాణం మండలాభివృద్ధికి ఆ ప్రాంత ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తమ సొంతభూములను ప్రభుత్వానికి ఉచితంగా విరాళంగా ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఏపీ కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప చొరవ నాయకత్వంలో నూతన మండలం ఏర్పాటు జరుగుతోంది. మండల అభివృద్ధికి తొలి అడుగుగా, పొరప్ప బజ్జన్న కుమారుడు పొరప్ప అనే రైతు ఒక ఎకరా భూమిని ఉదారంగా విరాళంగా ఇవ్వడానికి ముందుకొచ్చాడన్నారు. పొరప్ప దేవేంద్రప్ప కుమారులు పొరప్ప గర్జప్ప, పొరప్ప రాజా కూడా సంయుక్తంగా ఒక ఎకరా భూమిని ఇవ్వడానికి ముందుకొచ్చారని, మొత్తం రెండు ఎకరాల విలువైన భూమిని ప్రభుత్వానికి అప్పగించనున్నామని తెలిపారు.

ప్రపంచ మేధావికి ఘన నివాళి

● అంబేడ్కర్ సేవలు గుర్తు చేసుకున్న ప్రజాప్రతినిధులు, మేధావులు
● యువత ఆదర్శంగా తీసుకోవాలని వక్తల పిలుపు


పత్తికొండలో పూలమాలలు వేస్తున్న రామచంద్రయ్య


ఆలూరులో..


వెల్దుర్తిలో..


ఆస్పరిలో..

పత్తికొండ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ పట్టణంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ 69వ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అంబేడ్కర్ సర్కిల్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు గురుదాస్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్, వీహెచ్‌పీఎస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు చందోలి తిరుపాల్, బోనాల కాశీ తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

యువత ఆదర్శంగా తీసుకోవాలని..

మద్దికెర: అంబేడ్కర్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని తహసీల్దార్ గూండాల్ నాయక్, ఎంపీడీవో కొండయ్య, సర్పంచ్ బండారు సుహాసిని అన్నారు. శనివారం అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని మద్దికెర మెయిన్‌బజారులో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్, బండారు అంజనేయులు, వైసీపీ ఉపాధ్యక్షులు కృష్ణ యాదవ్, కార్యదర్శి విజయకుమార్, వీఆర్వో రంగస్వామి పాల్గొన్నారు.

ఆలూరు: .శనివారం రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆలూరులో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉచ్చురంగ, బాలరాజు, గంగాధర్, సుధాకర్, చెవేల షావు రాజన్న తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: మండల కేంద్రమైన వెల్దుర్తిలో ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో డా.బిఆర్.అంబేడ్కర్ 69వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాతబస్టాండ్ కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. మాసపోగు బజారు, మాజీ జడ్పీటీసీ ఐజయ్య, నాయకంటి గిడ్డయ్య, ప్రకాశ్, బ్రహ్మం పాల్గొన్నారు.

ఆదోని అగ్రికల్చర్ : రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 69వ వర్ధంతిని పురస్కరించుకొని దళిత హక్కుల పోరాట సమితి, ఏఐవైఎఫ్ నాయకులు శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఏఐవైఎఫ్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి సీపీఐ పట్టణ కార్యదర్శి వీరేష్ నివాళులర్పించి మాట్లాడారు. నాయకులు గిరిమల్లెప్ప పులిరాజు లింగన్న చంద్రశేఖర్ రామకృష్ణ రాము పాల్గొన్నారు.

ఆస్పరి: మండలకేంద్రమైన ఆస్పరిలో నారాయణ ప్రైమ్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేడ్కర్ 69వ వర్ధంతి వేడుకలను నిర్వహించారు పాఠశాల డైరెక్టర్ దీప్తి, పాఠశాల ఉపాధ్యాయులు సతీష్‌కుమార్, ఈశ్వరప్ప, నీలకంఠ, త్రివేణి, పవిత్ర, పద్మావతి, అశ్విని, నరసింహ పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేడ్కర్ 69వ వర్ధంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఏపీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాల వన్నూరప్ప, మాల అంజి, మెకానిక్ వీరేష్, మోహన్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

హొళగుంద : శనివారం స్థానిక సీజనల్ హాస్టల్‌లో అంబేడ్కర్ వర్ధంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అంతకు ముందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థినీ, విద్యార్థులు ఉపాధ్యాయులు సోహెబ్ దుర్గయ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ చేస్తే ప్రజా ఉద్యమం


సంతకాల సేకరణ చేపట్టిన వైసీపీ నాయకులు

పత్తికొండ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తే ప్రజా ఉద్యమం చేపడతామని మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం పత్తికొండ పట్టణంలోని ఎస్సీ కాలనీలో పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మాజీ ఎంపీపీ ఆధ్వర్యంలో చేపట్టారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వమే మెడికల్ కాలేజీలను నిర్మిస్తే ఇవాళ కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను నడపలేక ప్రైవేటీకరణ చేస్తామనడం సమంజసం కాదన్నారు. పేదలకు, విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయాలని చూస్తే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నారాయణదాస్, సర్పంచ్ కొమ్ము దీపిక, శ్రీరంగడు, సోమశేఖర్, మాజీ ఎంపీటీసీ కొమ్ము నెట్టేకల్, సుంకన్న, నాగరాజు, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

దేవరను జయప్రదం చేయాలి


ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నాయకులు

ఆదోని రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నెట్టేకల్‌లో జరిగే గ్రామ దేవరను జయప్రదం చేయాలని టీడీపీ సీనియర్ నాయకులు నెట్టేకల్ నాగరాజు యాదవ్, ఈరన్నలు కోరారు. ఈనెల 9వ తేదిన గ్రామంలో జరిగే పెద్దమ్మవ్వ, సుంకలమ్మవ్వల ఊరు దేవర సందర్భంగా వారు శనివారం టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షినాయుడుకు, సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడులను కలిసి ఆహ్వాన పత్రికలను అందించారు. ఏలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించాలని కోరారు. ప్రతాప్‌రెడ్డి, రంగస్వామి, జీవరత్నం, బాబునాయుడు పాల్గొన్నారు.

పది కుటుంబాలు మ్యాపింగ్ చేయండి

మద్దికెర, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆయా గ్రామాల్లో బీఎల్‌వోలు పర్యటించి ప్రతి రోజు పది కుటుంబాలనైనా తప్పనిసరిగా మ్యాపింగ్ చేయాలని తహసీల్దార్ గూండాల్ నాయక్ ఆదేశించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలు ఓటరు జాబితాలో సవరణ చేశారు. ఓటరు జాబితాపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. బీఎల్వోలు రంగస్వామి, రషీదు, స్వర్ణ, దామోదర్, హనీఫ్, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

డబ్బుల వసూళ్లపై విచారణ

హొళగుంద , డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందించేందుకు పీహెచ్‌సీ సిబ్బంది రోగుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు కలెక్టర్ సిరికి ఫిర్యాదులు అందడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టినట్లు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో లు సత్యవతి, రఘురామిరెడ్డి శనివారం విచారణ చేపట్టినట్లు తెలిపారు. వివరాలను లిఖిత పూర్వకంగా తీసుకొని జిల్లా అధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు. డ్యూటీ డాక్టర్ బిందుమాధవి పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా బసవరాజు

హాలహర్వి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులుగా నిట్రవట్టికి చెందిన బసవరాజును రాష్ట్ర నాయకత్వం ఎంపిక చేసింది. హాలహర్వి మండలానికి చెందిన బసవరాజు గత అసెంబ్లీ ఎన్నికల్లో తేదేపా అభ్యర్థి కోసం కృషికి గుర్తింపుగా జిల్లా పదవి ఇవ్వడం జరిగింది.

దివ్యాంగుల సంక్షేమానికి సీఎం కృషి

పత్తికొండ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేయడం అభినందనీయమని దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎల్లప్ప అన్నారు. రామాంజినయులు, ఉరుకుందమ్మ, సోమన్న, శేషయ్య, నారాయణపాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్ పురుగు కాటు ప్రాణాంతకం కాదు

దేవనకొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ అనే పురుగు కాటు ప్రాణంతకం కాదని జిల్లా నోడల్ అధికారి డా. రఘు అన్నారు. శనివారం దేవనకొండ వైద్యశాలను తనిఖీచేశారు. స్క్రబ్ టైఫస్ (చిగ్గర్) అనే చిన్న పురుగని, పొలాలు, గడ్డివాములు, పశువుల కాటిళ్ల వద్ద సంచరించడం జరుగుతుందన్నారు. పురుగు కాటు వేసిన చోట నల్ల మచ్చ ఏర్పడుతుందన్నారు. వైద్యుల సూచనలు పాటించి, మెరుగైన వైద్యం తీసుకోవాలన్నారు. కళ్యాణ్, భాగ్యలక్ష్మి, శ్రీధర్, ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

ఆదోని జిల్లాతోనే.. పశ్చిమ ప్రాంత అభివృద్ధి

● ఇరవై ఒకటో రోజుకు చేరుకున్న దీక్షలు
● ఏపీ బోయ వాల్మీకి సంఘం సంఘీభావం
● పెద్దహరివాణం మాకొద్దు


మద్దతు తెలుపుతున్న వాల్మీకి సంఘం నాయకులు

ఆదోని అగ్రికల్చర్ , డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ ప్రాంత పల్లెలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే ఆదోని జిల్లా చేయాలని జిల్లా సాధన సమితి జేఏసీ నాయకులు రాఘరామయ్య, లలిత, కృష్ణమూర్తి గౌడ్, వీరేష్ కోదండ, తిరుమల, కుంకనూరు వీరేష్, దస్తగిరి అన్నారు. ఆదోని జిల్లా సాధన కోసం కోట్ల కూడలిలో చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 21 రోజులకు చేరుకున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు మహమ్మద్ ఆయూబ్ మొహమ్మద్ సాదిక్, కాజా షాబ్, హెచ్ఎం భాష, ఫయాజ్ పటేల్, నూర్ మేము సహితం అంటూ దీక్షలో కూర్చున్నారు. దీక్షలకు ఏపీ ఎన్‌జీవో అధ్యక్షురాలు ఉషారాణి ఆధ్వర్యంలో ఏపీ వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి నాయుడు ఆధ్వ ర్యంలో భారీగా తరలివచ్చి సంఘీభావం తెలిపారు. పరిపాలన వికేంద్రీ కరణ ప్రజలకు కార్యాలయాలు అందుబాటులో ఉండాలంటే ఆదోని కేంద్రంగా జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యమం తీవ్రతరం కాకుండా ప్రభుత్వం చొరవచూపాలన్నారు. వాల్మీకి సంఘం నాయకులు అర్జున్ వీరేష్ దుర్గేష్, నాగరాజు, వీరారెడ్డి సురేష్, సుధాకర్, కల్లుబావి రాజు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షను సీఎం దగ్గరకు వెళ్తాం : మీనాక్షి నాయుడు

ఐదు నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలతో పాటు జేఏసీ నాయకులు ప్రతిపక్ష ప్రజా సంఘాలను కలుపుకొని తమ మంత్రులు జోన్ 5 ఇన్‌చార్జి ఎంపీలతో కలిసి చర్చించాక త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దగ్గరికి వెళ్తామని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు తెలిపారు. శనివారం చేసిన నాయకులు మీనాక్షి నాయుడు స్వగృహంలో కలిసి ఆదోని జిల్లా సాధన పై చర్చించారు.

ఆమరణ నిరాహార దీక్షలు చేస్తాం..

ఆదోని రూరల్: పెద్దహరివాణం మాకొద్దని ఆదోని మండలంలోనే కొనసాగుతామని సంతేకుడ్లూరు గ్రామస్థులు ఆందోళన బాట పట్టారు. నూతనంగా ఏర్పడ్డ పెద్దహరివాణం మండలంలో సంతేకుడ్లూరును కలపాలని ప్రజలు కోరుకోలేదని, గ్రామ పంచాయతీ తీర్మానం ఇవ్వకుండానే అధికారులు తమ గ్రామాన్ని పెద్దహరివాణంలో ఏలా కలుపుతారంటూ, శనివారం సంతేకుడ్లూరు ప్రధాన రహదారిలో ఆందోళనకు దిగి రెండు గంటలపాటు రోడ్డుపై బైఠాయించారు.

ఆమరణ నిరాహార దీక్షలు చేస్తాం...


సంతేకుడ్లూరు రోడ్డుపై ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

మా అభిప్రాయం తీసుకోకుండా పెద్దహరివాణం మండలంలో ఏలా కలుపుతారని గోనేహాళ్ గోపాల్ రెడ్డి, గణేకల్ విరుపాక్షిలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామాలను ఆదోని మండలంలోనే కొనసాగేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆమరణ నిరాహార దీక్షలు చేస్తామని వారు హెచ్చరించారు. నేటి నుండి న్యాయం జరిగేవరకు ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు.

మా భూమిని కాజేశారు..


ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

పత్తికొండటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డబ్బులు వెచ్చించి భూమిని కొనుగోలు చేసి, మాపైన ఆన్‌లైన్ అడంగళ్ రికార్డు పూర్వకంగా మా పేర్లపై ఉన్న భూమిని మరొకరి పేరుపై ఆన్‌లైన్ చేసి మాకు అన్యాయం చేసిన రెవెన్యూ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయాలని పత్తికొండ పట్టణానికి చెందిన కంబగిరి, సుల్తాన్‌అబ్దుల్ శనివారం అధికారులకు మొరపెట్టుకున్నారు. శనివారం ఆర్డీఓ భరత్‌నాయక్‌ను కలిసి సమస్యను విన్నవించారు. పత్తికొండ పట్టణానికి చెందిన కంబగిరికి, ఆయన కుటుంబ సభ్యులు పత్తికొండ రెవెన్యూ పరిధిలో ఓ సర్వే నంబరులో 2 ఎకరాల 5 సెంట్లు భూమి ఉంది. అలాగే సుల్తాన్‌అబ్దుల్‌కు చెందిన మరో సర్వేనంబర్ 2 ఎకరాల 88 సెంట్ల భూమి వారి పేర్లపై రికార్డు పరంగా ఉంది. ఈ రెండు సర్వేనంబర్లకు సంబంధించి భూమికి సంబంధం లేని, ఆధారాలు లేని వ్యక్తులపై ఆన్‌లైన్ చేసి పాసుపుస్తకం అడంగల్‌లో ఎలా ఎక్కిస్తారని, ఇదంతా స్థానిక రెవెన్యూ అధికారుల మాయాజాలమని, తమకు తీవ్ర అన్యాయం జరిగిందని వారు వాపోయారు. స్పందించిన ఆర్డీఓ భరత్‌నాయక్ మాట్లాడుతూ ఈ సంఘటనపై తక్షణమే విచారణ జరుపుతామన్నారు. భూమిపై హక్కులు కలిగిన వారి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

అయ్యప్ప స్వామికి పడిపూజ

ఆస్పరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగరడోన గ్రామంలోని నల్లారెడ్డి స్వామి దేవాలయ ఆవరణలో వెలిసిన । అయ్యప్ప స్వామి 9వ పడిపూజ కార్యక్రమాన్ని శనివారం అయ్యప్పస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నేషనల్ విద్యాసంస్థల అధినేత మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, రిటైర్డ్ వీఆర్వో సీతారామిరెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ వెంకన్న, గ్రామపెద్దలు సిద్ధరామయ్య, పాల్గొన్నారు.

ఉల్లి రైతులను ఆదుకోవాలి

పత్తికొండ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజాసాహెబ్ డిమాండ్ చేశారు. శనివారం ఆర్డీఓ భరత్‌నాయక్‌కు సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు.సీపీఐ మండల కార్యదర్శి కారుమంచి, పట్టణ కార్యదర్శి రామాంజినేయులు, రైతు సంఘం నాయకులు సిద్ధు, కారన్న, వెంకటరామిరెడ్డి, వీరన్న పాల్గొన్నారు.

కనెక్షన్ ఇప్పించండి సారూ..

● కరెంట్ ఆఫీసు ఎదుట అంబేడ్కర్ ఫొటోతో నిరసన


నిరసన చేస్తున్న మహిళా రైతు

హొళగుంద , డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రైతు తమ పొలానికి కొత్త ట్రాన్స్ఫర్మర్‌తో పాటు విద్యుత్ కనెక్షన్ కోసం విద్యుత్ కార్యాలయం, చుట్టూ తిరిగి విసిగిపోయామని దీంతో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద టెంటు వేసి అంబేద్కర్ ఫోటో పెట్టుకొని శనివారం వినూత్న నిరసన చేపట్టారు. హొళగుందకు చెందిన మహిళా రైతు ఓబుళమ్మ తన భర్త మల్లేష్‌తో కలిసి ధర్నాకు దిగారు. ట్రాన్స్ ఫార్మర్ కోసం తాము ప్రతి రోజు అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయినట్లు తెలిపారు. చేసేది లేక టెంటు వేసి నిరసన చేపట్టినట్లు తెలిపారు. ఈ విషయంపై విద్యుత్ అధికారణి ఓబుళమ్మ ను వివరణ కోరగా సంబంధిత రైతు పొలం పక్కన, రైతులు తమ పొలంలో పంటలు వేయడంతో విద్యుత్ స్తంబాలు, ట్రాన్స్ఫార్మర్ తరలించడానికి ఇబ్బందులు ఉన్నాయని అన్నారు. రైతులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు చేయూత

ఆలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం ప్రత్యేక బోధనతో పాటు అవసరమైన పరికరాలను ప్రభుత్వం అందిస్తోందని జిల్లా సహిత విద్య కో ఆర్డినేటర్ సురేంద్రబాషూజీ అన్నారు. శనివారం ఆలూరు భవిత భవనంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 90 మంది దివ్యాంగులకు వీల్‌చైర్స్ సైకిల్ చైర్, వినికిడి యంత్రాలు, ఆట వస్తువులను ఉచితంగా అందజేశారు. వీటిని ఉపయోగించుకుని ముందుకు సాగాలని కోరారు. పాఠశాల హెచ్ఎం సుజాత, సాహిత విద్య ౨ రాందాస్, అరుణ, సురేఖ పాల్గొన్నారు.

శనగలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

మద్దికెర, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగు చేసిన పప్పుశనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను కాపాడుకోవాలని ఏవో రవి శనివారం తెలిపారు. మండలంలో దాదాపు 18 వేల ఎకరాల్లో శనగ పంట సాగైంది. ప్రస్తుతం పైరు పూత, పింజ దశలో ఉందన్నారు. ఈ సమయంలో పంటకు భూమి నుంచి వచ్చే తెగుళ్లు ఆశించి నష్టం కలిగిస్తాయన్నారు. పంట సంరక్షణకు తగిన సలహాలు సూచనలకు రైతులు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలన్నారు. వ్యవసాయ సిబ్బంది ఆనంద్, వంశీ పాల్గొన్నారు.

ఉనికి కోసమే కార్మికులకు మద్దతు

● వైసీపీపై ఎమ్మెల్యే బీవీ ధ్వజం

ఎమ్మిగనూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పనిచేస్తూ చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వకుండా.. ఐదేళ్ల తరువాత ఉద్యోగాల కోసం పోరాటం చేస్తున్న కార్మికులకు మద్దతు ఇవ్వటాన్ని బట్టి చూస్తే కేవలం ఉనికిని కాపాడుకునేందుకే మద్దతిచ్చినట్లు తెలుస్తోందని వైసీపీపై ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ధ్వజమెత్తారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్మికులకు ఉద్యోగాల కోసం ఐదేళ్లలో పోరాటం చేసుంటే సంతోషించే వాళ్లమన్నారు. గత ప్రభుత్వంలో కార్మికులకు ఉద్యోగాలు ఇవ్వకుండా నేడు పోరాటాలకు మద్దతు ఇస్తున్నారని, దీన్ని పోరాటాలు చేసే వాళ్లు గమనించాలని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే తన దగ్గరకు వచ్చిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పామని, ఇందులో భాగంగానే 13మందికి కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగాలు ఇస్తు ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసిందని సర్క్యులర్ కాపీని చూపించారు. కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇచ్చేందుకు కృషి చేసిన సీఎం చంద్రబాబు నాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఆప్కాస్‌లో నమోదు అయిన వెంటనే వీరు విధుల్లో చేరుతారన్నారు. అనంతరం 13మంది కార్మికుల కుటుంబాలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. వీరికి ఉద్యోగాల ఉత్తర్వుల కాపీని ఎమ్మెల్యే అందజేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మాచాని మహేశ్, నాయకులు మిన్నప్ప, షబీర్, కలీముల్లా, సుందరరాజు, వీరేంద్ర, శాలేమ్, అంబేడ్కర్, ఉరుకుందు, జయన్న, రామకృష్ణారెడ్డి, అబ్దుల్ పాల్గొన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో కర్ణాటక డీఎస్పీలు

మంత్రాలయం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం రాయచూర్, సైబర్ క్రైం, గోకాక్ డీఎస్పీలు శాంతివీరా, వెంకటేశ్, రవి నాయక్ శనివారం మంత్రాలయానికి వచ్చారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. మఠం పండితులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, శ్రీపతిఆచార్, ఐపీ నరసింహమూర్తి, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్, శంకర్‌గౌడ్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ శేషఫణి బదిలీ



ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల తహసీల్దార్ శేషఫణి బదిలీ అయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బదిలీల్లో భాగంగా 2024 ఆగస్టు 1వ తేదీన ఎమ్మిగనూరు మండల తహసీల్దార్‌గా శేషఫణి నియమితులయ్యారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమైనట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో స్థానికంగా పనిచేస్తున్న తహసీల్దార్ శేషఫణిని కర్నూలులోని ఉన్నతాధికారులకు రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వులు వచ్చినట్లు సమాచారం.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్ : టీడీపీ



బాధితులకు చెక్కులను అందజేస్తున్న చెన్న బసప్ప

కౌతాళం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప అన్నారు. కౌతాళంలో శనివారం మండలంలోని బాధితులకు ముఖ్యమంత్రి నిధి కింద మంజూరైన చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. చెన్నబసప్ప మాట్లాడుతూ రూ.58,375 చెక్కులను పంపిణీ చేశారు. ఉప్పరహాల్ గ్రామానికి చెందిన సరోజమ్మ, బాపురం గ్రామానికి చెందిన ఈరమ్మకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా సరోజమ్మ కుమారుడు గోపాల్‌రెడ్డి, ఈరమ్మ కుమారుడు తిరుమల రెడ్డికి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా నిర్వహక కార్యదర్శి కోట్రేష్‌గౌడ్, డొమ్మలదిన్నె రమేష్‌గౌడ్, శివప్పగౌడ్, రాజబాబు, సిద్ధు, మంజు ఉన్నారు.

జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సీపీఐ శతజయంతి ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ సమితి సమావేశం నిర్వహించారు. గిడ్డయ్య మాట్లాడుతూ సీపీఐ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతోందని చెప్పారు. ఈనెల 10వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతున్నట్లు తెలిపారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 18వ తేదీన భారీ స్థాయిలో ఆందోళనలకు సిద్ధం కావాలన్నారు. అలాగే జనవరి 18న ఖమ్మంలో నిర్వహించే శతజయంతి ముగింపు ఉత్సవాలకు భారీ స్థాయిలో ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్నగౌడ్, రంగన్న, సోమేశ్వరరెడ్డి, మద్దిలేటినాయుడు, రాజీవ్, శ్రీరాములు, జబ్బార్, బజారి, మల్లికార్జునగౌడ్ పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి విరాళం

మంత్రాలయం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి చెన్నైకు చెందిన వినోత్ కుమార్ అనే భక్తుడు రూ.1.50 లక్షలు అన్నదానానికి విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, సురేష్ కోణాపూర్ లు తెలిపారు. శనివారం రాత్రి కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ.1.50 లక్షలు నగదును విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చారు. శ్రీపాదాచార్, జేపీ స్వామి పాల్గొన్నారు.

వడ్డెర్ల సమస్యలపై పోరాటం



మాట్లాడుతున్న బేబిరాణి

మంత్రాలయం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వడ్డెర్లు ఎదుర్కొంటున్న సమస్యల కోసం పోరాటంచేస్తూ హక్కులు సాధించుకుంటామని ఏపీ వడ్డె రాజుల సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు వేము బేబిరాణి అన్నారు. శనివారం మంత్రాలయంలో ఆమె మాట్లాడుతూ శ్రీశైలంలోని వడ్డెర సత్రంలో అన్యమత ప్రక్షాళన లక్ష్యంగా అందరూ కలిసిరావాలని పిలుపునిచ్చారు. శ్రీశైలంలో వడ్డెర కులానికి చెందిన వ్యక్తి వేరే మతం స్వీకరించి వడ్డెర భక్తుల విరాళాలతో నిర్మించిన వడ్డెర సత్రంలో వడ్డెర్లకు గదులు ఇవ్వకుండా ఇతర కులాలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. శ్రీశైలం ట్రస్టు బోర్డు ఈ విషయంపై దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్డె నారాయణ, మాధవ్, వేలాద్రి, దేవరాజు, సురేంద్రబాబు, రాము, రవికుమార్, వీరేష్, పురుషోత్తం, కృష్ణమూర్తి, చిన్నఈరన్న, గోపాల్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

● పట్టణాలు, గ్రామాల్లో వర్ధంతి సభలు
● పాల్గొన్న వివిధ పార్టీలు, సంఘాల నాయకులు





ఎమ్మిగనూరులో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు



మంత్రాలయం: జైభీమ్ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..



పెద్దకడబూరులో..

ఎమ్మిగనూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఇంటి వద్ద అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి ఎమ్మెల్యే నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సోమేశ్వరరెడ్డి, మహేశ్, దావీదు, ఉరుకుంద, విజయలక్ష్మి, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం: మంత్రాలయంలో శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కేం జానయ్య, ఏపీ ఎమ్మార్పీఎస్ జిలా అధికారి ప్రతినిధి యోబు, సుంకేశ్వరి గ్రామంలో బీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు రామతీర్థం అమ్రేష్, కేవీపీఎస్ జిల్లా ఉపాదక్షుడు జయ రాజు, ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేశ్ ఆధ్వర్యంలో వేర్వేరుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళి అర్పించారు.బీఎస్ఎస్ అధ్యక్షుడు స్వామినాథన్, అడ్వకేట్ కిషోర్, దేవా, బాలస్వామి, జిల్లా కార్యదర్శి గర్జి హనుమన్న, రత్నం, యోహన్, చిన్న, నరసింహులు,అనీల్ కుమార్, మారెన్న, నాగేంద్ర, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కౌతాళం: కౌతాళంలో దళిత సంఘం నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జైభీమ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. కామవరం గ్రామంలో సర్పంచ్ వసంత, గుడికంబాలిలో ఆనంద్, బాపురంలో జయపాల్ ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వహించారు.

పెద్దకడబూరు : పెద్దకడబూరుతో పాటు గ్రామాల్లో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. టీడీపీ నాయకులు బొగ్గుల తిక్కన్న, ఎమ్మార్పీఎస్ నాయకులు యువరాజ్, సతీష్, జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు బుజ్జప్ప, ఆదామ్, అలాగే నాయకులు నాగరాజు, సామేలు, యేసన్న, రాజ్‌కుమార్, ప్రభాకర్, శీమోన్, నవీన్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలో జైభీమ్ ఎమ్మార్పీఎస్, సమతా సైనికదళ్, పూలే అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ నాయకులు అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. సమతా సైనికదళ్ రాష్ట్ర కార్యదర్శి రంగయ్య, పూలే అంబేడ్కర్ సొసైటీ గౌరవాధ్యక్షులు ఆల్‌ఫ్రెడ్‌రాజ్, బీజేపీ నాయకులు గురురాజ్‌దేశాయ్, జైభీమ్ ఎమ్మార్పీఎస్ బుజ్జి, చార్లెస్, నరసన్న, బతుకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో-కన్వీనర్ కాశీంవలి, నాయకులు పాల్గొన్నారు. అలాగే గుడికల్లులో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు.

గోనెగండ్ల: గోనెగండ్లలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కరుణాకర్, నాయకులు ప్రసాద్, సరేష్, పెద్దయ్య, సీఐటీయూ నాయకులు నబీరసూల్, కేజీబీఎస్ మండల అధ్యక్షుడు మునిస్వామి, విజయ్, రాఘవేంద్ర, వీరన్నగౌడ్, రహింబాషా, బాబు, రాజు, కిట్టు పాల్గొన్నారు.

నందవరం: హాలహర్వి సర్పంచ్ తిమ్మప్ప, కనకవీడులో డబ్బా ఈరన్న ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమాల్లో దళిత నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో సమతా సైనికదళ్ ఆధ్వర్యంలో..



గోనెగండ్ల: కేవీపీఎస్ ఆధ్వర్యంలో..



కౌతాళం: టీడీపీ ఆధ్వర్యంలో..



నందవరం: హాలహర్వి గ్రామంలో..

టీడీపీ బలోపేతానికి కృషి

● మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం/ కోసిగి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు ఆ పార్టీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి తెలిపారు. కోసిగి మండలంలోని డి.బెళగల్ గ్రామంలోని 40 వైసీపీ కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. శనివారం రాత్రి మాధవరం గ్రామంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి నివాసంలో డీలర్ సాతర్ల ఉరుకుందప్ప, ఎంపీటీసీ వీరేష్, రామయ్య, నాగేంద్రప్ప, బండమీద వీరేష్, శ్రీనివాసులు, మహానంది, వీరన్న, రాముడు, భీమయ్య, సుంకన్న, అయ్యప్ప, నాగరాజు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి రాఘవేంద్రరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు రఘునాథరెడ్డి, మంచాల సొసైటీ చైర్మెన్ రామకృష్ణరెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాకేష్ రెడ్డి, రాజారెడ్డి, కోసిగి మండల అధ్యక్షులు పల్లిపాడు రామిరెడ్డి, జ్ఞానేష్, అయ్యన్న, నర్సిరెడ్డి, టీడీపీ నాయకులు నాగర్జున, బసవ, వినోద్, పరమేష్, కోటేశ్వరరావు, లక్ష్మన్న, రోగప్ప, గుర్జింటి భీమిరెడ్డి, నాగరాజు, బూదిరెడ్డి, జయరాం, కేశన్న, బొజ్జప్ప పాల్గొన్నారు.


రైతుల సమస్యలపై సబ్ కలెక్టర్ విచారణ

మంత్రాలయం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తరతరాలుగా శ్రీమఠం భూములను సాగుచేస్తూ జీవనం చేస్తున్న రైతులకే భూములు చెందేలా అధికారులు చూడాలని వనికే నాగరాజు, సున్నంరఘు, ఎంపీటీసీ మేకల వెంకటేష్, రామకృష్ణ, గురురాజు, భీమేష్, వీరయ్యశెట్టి ఆదోని సబ్ కలెక్టర్ అజయ్‌కుమార్‌కు మొరపెట్టుకున్నారు. శుక్రవారం రాత్రి మంత్రాలయం తహసీల్దారు కార్యాలయంలో శ్రీమఠం భూములు సాగుచేస్తున్న రైతులు, చెట్నహళ్లి స్మశాన సమస్యలపై విచారణ చేపట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కుటుంబాలు తరతరాలుగా భూమిని సాగు చేసుకుంటూ జీవనం చేస్తున్నా మంత్రాలయం తహసీల్దారు శ్రీమఠానికి అనుకూలంగా రైతులను సంప్రదించకుండా ఎండర్స్‌మెంట్ ఇచ్చారని వాపోయారు. ఈసందర్భంగా అనుభవంలో ఉన్న భూములకు సంబంధించిన కార్యాలయం ద్వారా ఈసీలు తెప్పించుకుని పరిశీలించి కలెక్టర్‌కు నివేదికలు పంపుతామని సబ్ కలెక్టర్ రైతులకు హామీ ఇచ్చారు. తహసీల్దారు రమాదేవి, రుద్రగౌడు, ఆర్ఐ జనార్దన్, రైతులు నర్సప్ప, భీముడు, మల్లేష్, నర్సప్ప, భీమేష్, అడవిరాజు, ప్రవీణ్, సునీల్ కుమార్, అగ్రీప్ ఉన్నారు.

ఆదోని జిల్లా సాధనకు సహకరించాలి

నందవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆదోని జిల్లాగా చేయడానికి అందరి సహకారం అవసరమని ఆదోని జిల్లా సాదన కమిటీ కోఆర్డినేటర్(జేఏసీ) కృష్ణ కోరారు. శనివారం మండలంలోని రైస్‌మిల్ అసోసియేషన్ తాలుకా అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు రైస్‌మిల్ నారాయణరెడ్డి మద్దతు కోరారు. రైస్ మిల్లర్స్ తరపున మద్దతు కావాలన్నారు. అలాగే తాలుకా లారీ అసోసియేషన్, పత్తి మిల్లుల అసోసియేషన్‌లను తమకు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ నెల 10 నుంచి ఎమ్మిగనూరు సోమప్ప సర్కిల్ రిలే నిరాహార దీక్ష చేపడతామని తెలిపారు. టీడీపీ మండల సహాయ కార్యదర్శి ప్రభు దాసు, జేఏసీ నాయకులు ఉదయ్, ఖాజా, రఘు, అఫ్రిద్ పాల్గొన్నారు.

తాగునీరు వృథా



వృథాగా పారుతున్న నీరు

పెద్దకడబూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గంగులపాడు గ్రామంలో తాగునీరు వృథాగా పారుతోంది. మండలంలోని ఎన్నో గ్రామాల్లో తాగునీటితో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే గంగులపాడు గ్రామంలో మాత్రం అధికారులు తాగునీటిని వృథా చేస్తున్నారు. గ్రామంలో కుళాయిలు ఏర్పాటు చేసి వాటి మూతులకు బిరడాలు ఏర్పాటు చేయకపోవడంతో తాగునీరు కాస్తా వృథాగా పారిపోతుంది. పంచాయతీ అధికారులు స్పందించి తాగునీరు వృథా కాకుండా కొళాయిలకు బిడరాలను ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

హెల్మెట్ ధరించాలి

కోసిగి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనదారులు హెల్మెట్ వాడి.. తమ విలువైన ప్రాణాలను రక్షించుకోవాలని కోసిగి ఎస్ఐ రమేష్ రెడ్డి సూచించారు. కోసిగిలోని ఉరుకుంద రోడ్డులో శనివారం ద్విచక్రవాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదంలో ఏ చిన్న ప్రమాదం జరిగినా కాపాడే అత్యంత ముఖ్యమైనది హెల్మెటేనని, దాని ప్రాముఖ్యతను తెలియజేశారు. దిచ్విచక్రవాహనాల ప్రమాదాల్లో అత్యధికంగా చాలా మంది తలకు తగిలిన గాయాలతో మరణిస్తున్నారని, అదే హెల్మెట్ ధరించిన వ్యక్తి 90 శాతం గాయపడినా ప్రాణాలతో బయటపడ్డారని అన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు: డీపీవో



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీపీవో భాస్కర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోసిగి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని డీపీవో భాస్కర్ హెచ్చరించారు. రెండు రోజుల క్రితం కోసిగిలోని 3వ వార్డు వాల్మీకినగర్‌లో ప్రబలిన విషజ్వరాలు అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించి శనివారం డీపీవోతో పాటు డిప్యూటీ ఎంపీడీవో ఈశ్వరయ్య స్వామి, ప్రభుత్వ వైద్యాధికారుల ఆధ్వర్యంలో వాల్మీకి నగర్‌ను పరిశీలించారు. డీపీవో మాట్లాడుతూ పారిశుధ్యంపై కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. జ్వరాలు వచ్చినప్పటి నుంచి పంచాయతీ సిబ్బంది బాగా వస్తున్నారనీ, అంతకుముందు సరిగ్గా రావడం లేదన్నారు. అనంతరం కాలనీవాసులు తమ కాలనీకి వచ్చే పైపులైన్ డ్రైనేజీలో కలిసిపోయి ఉండటంతో తాగునీరు కలుషితమై వస్తున్నాయనీ విన్నవించారు. కాలనీవాసులు, యువకులతో కలిసి అక్కడకు వెళ్లి తాగునీటి పైపులైన్ పరిశీలించి మురుగునీటిలో ఉన్న పైపులైన్ వాల్‌ను రెండు రోజుల్లోగా మార్చాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తిమ్మరాజుకు ఫోన్ ద్వారా తెలియజేశారు. ఇంకా వారం రోజుల పాటు వాల్మీకి నగర్‌లో పారిశుధ్య పనులు, ఫాగింగ్ చేయాలని పంచాయతీ సిబ్బందికి, డిప్యూటీ ఎంపీడీవో ఈశ్వరయ్యస్వామికి తెలియజేశారు. అనంతరం కాలనీలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని వైద్యులతో కలిసి పరిశీలించారు. డా.ఇబ్రహీం, సామాజిక ఆరోగ్య అధికారిణి ఈశ్వరమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ ఉదయ్, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసులు, ఆరోగ్యకార్యకర్త మల్లికార్జున, ఏఎన్ఎం సుజాత, ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి



ముగతిలో ఎరువులు పంపిణీ చేస్తున్న నాయకులు

నందవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ మండల కార్యదర్శి భార్గవ్‌యాదవ్ అన్నారు. మండలంలోని ముగతి గ్రామంలో శనివారం పార్టీ గ్రామ అధ్యక్షుడు గుగ్గిరి నరసింహులు ఆధ్వర్యంలో రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ కడుబూరి, కొండయ్య, మాజీ ఉప సర్పంచ్ తాయన్న, చింతకాయల అనుమన్న, రామకృష్ణ, ధనుంజయ్, రైతులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ ఫారం అసోసియేషన్ అధ్యక్షుడిగా గట్టు అల్తాఫ్

ఎమ్మిగనూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని చికెన్ పౌల్ట్రీ ఫారం అసోసియేషన్ అధ్యక్షుడిగా టీడీపీ నాయకులు గట్టు అల్తాఫ్‌ను ఎన్నుకున్నారు. శనివారం పౌల్ట్రీ ఫారం నిర్వాహకుల సమావేశం నిర్వహించి నూతన అధ్యక్షుడిగా గట్టు అల్తాఫ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగతా కార్యవర్గ సభ్యులను త్వరలో ఎన్నుకోనున్నట్లు తెలిపారు. అనంతరం టీడీపీ సీనియర్ నాయకుడు బాస్కర్ల చంద్రశేఖర్‌ను ఫారం నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. సమావేశంలో నాయకులు నరసింహారెడ్డి, జహంగీర్, ఖాజా, అశోక్, బాషా, నాగరాజు, బాబా, నవాబ్ పాల్గొన్నారు.

సమస్యలను త్వరగా పరిష్కరించాలి



అధికారులకు వినతులు అందజేస్తున్న వినియోగదారులు

ఎమ్మిగనూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అదాలత్‌లో వినియోగదారులు తెలిపిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ అదాలత్ చైర్మన్, రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి అధికారలకు సూచించారు. పట్టణంలోని మంత్రాలయం రోడ్డులో ఉన్న విద్యుత్ కార్యాలయం ఆవరణలో శనివారం ఈఈ విజయరాజ్ అధ్యక్షతన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా నందవరం, ఎమ్మిగనూరు, గూడూరు, కోడుమూరు ప్రాంతాలకు చెందిన పలువురు విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లులు అధికంగా వచ్చిందని తగ్గించాలని, తమ గ్రామాల్లో ఇళ్లపై కరెంటు తీగలు ఉన్నాయని వాటిని తొలగించాలని కోరుతూ వినతులు అధికారులకు అందజేశారు. అనంతరం విశ్రాంత జడ్జితో పాటు మధుకుమార్, శ్రీనివాస బాబు, విజయలక్ష్మి మాట్లాడుతూ వినియోగదారులు తెచ్చిన సమస్యలను నిర్లక్ష్యం చేకుండా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యాక్రమంలో ఎమ్మిగనూరు, మంత్రాలయం, గూడూరు డీఈలు నాగేంద్ర కుమార్, స్వరూప్, జైసన్, ఏఈ ప్రసన్న ఆంజనేయులు, గురుమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్ లక్షణాలపై అవగాహన కల్పించాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న నోడల్ అధికారి డాక్టర్ రఘు

గోనెగండ్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా సంచార చికిత్స నోడల్ అధికారి డాక్టర్ రఘు సూచించారు. గోనెగండ్లలోని ప్రభుత్వ ఆసుపత్రిని శనివారం ఆయన పరిశీలించారు. అక్కడి సిబ్బందితో ఆయన మాట్లాడారు. మండలంలో వ్యాధులు ఎక్కువగా ఏ గ్రామాలలో సోకుతుందన్నాయి అందుకు ఆరోగ్య సిబ్బంది ఎలా స్పందిన్నారని ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాధా, సామాజిక ఆరోగ్యఅధికారి మేరిగోల్డ్, ఆరోగ్య విస్తరణాధికారి హనుమంతు, వేణుగోపాల్, ఖలీల్ పాల్గొన్నారు.

దీక్షకు మద్దతు



షేర్ హోల్డర్లకు పూలమాలలు వేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో నాలుగో రోజు శనివారం లెదర్ సొసైటీ షేర్‌హోల్డర్ల దీక్షలు కొనసాగాయి. వారికి వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. లెదర్ సొసైటీ షేర్‌హోల్డర్లకు పూలమాలలు వేశారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ లెదర్ సొసైటీలో జరుగుతున్న అన్యాయాలను, మోసాలను అరికట్టి షేర్ హోల్డర్లకు తగిన న్యాయం చేయాలన్నారు. చనిపోయిన షేర్ హోల్డర్ల షేర్లు కుటుంబ సభ్యులకే చెందాలన్నారు. ప్రైవేట్ వ్యక్తులకు కల్పించిన షేర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. లెదర్ సొసైటీ ఆస్తులను కాపాడాలని, వాటికి చట్టబద్ధత కల్పించాలని కోరారు. రిలే నిరాహార దీక్షల్లో గౌరన్న, సుధాకర్, రంగన్న, రాజులు కూర్చొన్నారు. ఖాదర్‌వలి, రియాజ్, భీమిరెడ్డి, ఎంపీపీ కేశన్న తదితరులు పాల్గొన్నారు.